

కనిగిరిలో అమరజీవి విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ ఎమ్మెల్యేలు ఉగ్ర, దామచర్ల, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, పార్టీ ఇన్‌చార్జిలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

తెలుగువారి ఆత్మగౌరవం అమరజీవి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- కనిగిరిలో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలు ప్రారంభం

7

రుణ సంబరం

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు స్వయం ఉపాధి యూనిట్లను అందించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత వైసీపీ హయాంలో పూర్తిగా నిర్వీర్యం చేసిన కార్పొరేషన్‌కు పునరుజ్జీవం కల్పించింది. అర్హత ఉన్న వారికి రుణాల మంజూరుకు సిద్ధమైంది. అందుకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా గత సోమవారం నుంచి ప్రారంభించింది. అన్ని మండలాల్లో దరఖాస్తులను ఆహ్వానిస్తూ అధికారులు ప్రకటనలు చేస్తున్నారు. దీంతో ఆయా వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

1,305 మంది లబ్ధిదారులు
రూ.54.61 కోట్ల రుణాలు



ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యూనిట్ల ఏర్పాటు

- నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించే దిశగా అడుగులు
- జనరిక్ మందుల దుకాణాలు.. డ్రోన్‌లు, రవాణా వాహనాలు
- ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ

ఒంగోలు నగరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి రాగానే గత వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిన పథకాలన్నింటినీ పునఃప్రారంభిస్తోంది. అందులో భాగంగానే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించే ప్రక్రియను చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అప్పటి వరకూ టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన అనేక పథకాలను అటకెక్కించింది. సంస్థను కేవలం బోర్డుకే పరిమితం చేసింది. బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించకుండా బడుగులకు మొండిచేయి చూపింది. ప్రస్తుత ప్రభుత్వం ఒక్కో పథకాన్ని పునఃప్రారంభిస్తోంది. అందులో భాగంగా జిల్లాలో రూ.54.61 కోట్లతో ఎస్సీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతతో యూనిట్లను ఏర్పాటు చేయించేందుకు ఈనెల 14 నుంచి దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించింది. వచ్చేనెల 13వతేదీ వరకూ కొనసాగనుంది. ఈ యూని ట్లను ఏర్పాటుకు ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ సొమ్మును విడుదల చేయగా బ్యాంకుల నుంచి మిగిలిన మొత్తాన్ని రుణంగా అందజేస్తారు. యూనిట్ విలువలో 40 శాతం సబ్సిడీగా, 55 శాతం బ్యాంకు నుంచి రుణంగా ఇస్తారు. లబ్ధిదారుడి వాటాగా కేవలం ఐదు శాతం మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

లక్ష్యాలు ఇలా....

- యూనిట్ విలువ రూ.3లక్షలతో 246 మందికి ఆటోలు ఇవ్వనున్నారు.
- రూ.8లక్షల యూనిట్ విలువైన నాలుగు చక్రాల ఆటోలు 50 మందికి మంజూరు చేయనున్నారు.
- రూ.10లక్షల యూనిట్ విలువ కలిగిన గూడ్స్ ఆటోలు 50మందికి ఇవ్వనున్నారు.
- రూ.10 లక్షల యూనిట్ విలువ కలిగిన కార్లు 50మందికి అందజేయనున్నారు.
- రూ.10లక్షల యూనిట్ విలువ కలిగిన డ్రోన్లు ఐదుగురు సభ్యులుగా ఉండే 12 గ్రూపులకు అందజేయనున్నారు.
- గరిష్ఠంగా రూ.20లక్షలు ఈవీ చార్జింగ్ యూనిట్‌ను ప్రయోగాత్మకంగా ఒకరికి ఇస్తారు.
- జనరిక్ మెడికల్ దుకాణాలు 23మందికి, మెడికల్ ల్యాబ్‌లు 24మందికి, బ్యూటీపార్లర్లు 16 మందికి రూ.5లక్షల యూనిట్‌గా అందజేయనున్నారు.
- రూ.4లక్షల యూనిట్ విలువతో 41మందికి ఫొటో స్టూడియో, కొబ్బరి పీచుతో వస్తువుల తయారీ యూనిట్లు 41 మందికి, ఆయుర్వేదిక్ మందుల దుకాణాలు 33 మందికి మంజూరు కానున్నాయి. రూ.3.95 లక్షలతో సోలార్ ప్యానెల్ అసెంబ్లింగ్ యూనిట్లను 33మందికి ఇవ్వనున్నారు.
- జూట్ బ్యాగ్‌ల తయారీ యూనిట్లు 41 మందికి, సోలార్ ఉత్పత్తుల విక్రయం, అమర్చడం యూనిట్లు 33 మందికి రూ.3.95 లక్షలతో అందించనున్నారు. రూ.4లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు యూనిట్ విలువగా పలు యూనిట్లు వందల సంఖ్యలో మంజూరు చేయనున్నారు.

జూన్ 21 నుంచి యూనిట్ల గ్రౌండింగ్

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలను మంజూరుచేసేందుకు ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రభుత్వం యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియను జూన్ 21వ తేదీ నుంచి ప్రారంభించనుంది. ఈలోపు లబ్ధిదారుల ఎంపిక, రుణ మంజూరు పత్రాల అందజేత, బ్యాంకుల్లో రుణాల విడుదల ప్రక్రియను పూర్తిచేస్తారు. ప్రభుత్వం ఎంపిక చేసిన యూనిట్లు నిరుద్యోగులకు ఆర్థికంగా భరోసా కల్పించే విధంగా ఉన్నాయి. ప్రజల నుంచి విశేషంగా స్పందన ఉన్న జనరిక్ మందుల దుకాణాలు, వ్యవసాయంలో నూతనంగా వినియోగిస్తున్న డ్రోన్లు, మెడికల్ ల్యాబ్‌లు, బ్యూటీపార్లర్లు, ఆటోలు, కార్లు, వస్తువులు తరలించే గూడ్స్ వాహనాలను కొనుగోలు చేసేందుకు కార్పొరేషన్ అధికారులు రుణాలు మంజూరు చేయనున్నారు.

ముఖ హాజరులో అక్రమాలు

వైద్య సిబ్బంది ట్యాంపరింగ్

- ఐఫోన్‌లో తప్పుడు హాజరు.. గుర్తించిన ఉన్నతాధికారులు
- వారిలో 14 మంది మెడికల్ ఆఫీసర్లు, ఇరువురు ఎంఆర్‌హెచ్‌పీఎస్‌లు
- భారీగా ఉన్న సిబ్బంది
- అందరికీ షోకాజ్ నోటీసులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేసే మెడికల్ అధికారులు ఐఫోన్ ద్వారా ముఖ హాజరును ట్యాంపరింగ్ చేస్తున్నట్లు వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. అలా చేస్తున్న వారిలో సిబ్బంది కూడా పెద్ద సంఖ్యలో ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కారు వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మార్పులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రాథమిక వైద్యశాలల్లో పనిచేసే వైద్యాధికారులు, ఇతర ఉద్యోగులకు ముఖ హాజరు తప్పనిసరి చేసింది. అందుకోసం ఒక సాఫ్ట్‌వేర్‌ను కూడా రూపొందించింది. ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ముఖ హాజరు వేస్తే సమయం, తేదీ, ఎక్కడ వేశారు అనేది నమోదవుతుంది. ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా అమలవుతోంది. అయితే ఎక్కువమంది మంది వైద్యాధికారులు, మెడికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది ఐఫోన్లను వినియోగిస్తున్నారు. ఆ ఫోన్ల ద్వారానే ముఖ హాజరు వేస్తున్నారు.



జిల్లాలో 13మంది మెడికల్ ఆఫీసర్లు, ఇద్దరు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవిడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు) హాజరు ట్యాంపరింగ్ చేసిన వారిలో ఉన్నారు. ఇక వైద్యశాఖలో పనిచేసే సిబ్బంది కూడా భారీగా ఉన్నట్లు సమాచారం. వారందరికీ షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు తెలిసింది. అర్ధవీడు, బేస్తవారపేట, ముండ్లమూరు, తూర్పుగంగవరం, పొన్నలూరు, వేములపాడు

ఉద్యోగుల్లో ఆందోళన

టంగుటూరు, కనిగిరి, ఎన్‌జీపాడు ప్రాథమిక వైద్యశాలల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్లకు ఇవి అందినట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్రస్థాయిలోనే ముఖ హాజరు నమోదు అక్రమాలను గుర్తించడంతో మెడికల్ ఆఫీసర్లు, ఇతర ఉద్యోగుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఉన్నతాధికారులు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం.

ఎన్నిగంటలకు వెళ్లినా..

కొందరు వైద్యాధికారులు, ఇతర సిబ్బంది వైద్యశాలలకు ఎన్ని గంటలకు వెళ్లినా వారి వద్ద ఉన్న ఐఫోన్‌లో సమయం ఏవిధంగా నమోదు చేసుకొని ఉంటారో ఆ విధంగానే ముఖ హాజరు తీసుకుంటుంది. ఉదాహరణకు ఒక వైద్యాధికారి ఉదయం 9.30 గంటలకు వైద్యశాలకు వెళ్లాల్సి ఉంటే ఆయన ఉదయం 11 గంటలకు వెళ్లి ఐఫోన్ ద్వారా ముఖహాజరు వేస్తే అందులో ఉదయం 9.30 గంటలు ఉంటే అదేసమయంలో హాజరైనట్లు నమోదవుతుంది. ఈ విషయాన్ని వైద్యారోగ్యశాఖశాఖ ఉన్నతాధికారులు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. తదనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా పరిశీలన చేసి ప్రస్తుతం ఆవిధంగా ట్యాంపరింగ్ చేసిన వైద్యాధికారులు 185 మంది, మరో 13వేల మంది వైద్య, పారామెడికల్ సిబ్బంది ఉన్నట్లు గుర్తించారు. వారందరికి ఇప్పుడు రాష్ట్ర వైద్యశాఖ ఉన్నతాధికారులు వారందరికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు.




వ్యాళి వాహనంపై చెన్నకేశవుడు

మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారు వ్యాళి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మాడ వీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. ఉభయదాతగా పచ్చళ్ల చెన్నకేశవప్రసాద్ వ్యవహరించారు. ఈవో గొలమారి శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షించారు.

- మార్కాపురం వన్‌టౌన్


ఇమాంసాహెబ్


సుబ్బారావు

పార్టీ ప్రకటించింది.. ప్రభుత్వం ఆపేసింది!

- ఏఎంసీ పదవులు దక్కినా నియామకాల్లో జాప్యం
- రిజర్వేషన్ల విషయంలో సీఎస్ కొర్రీలే కారణం
- సీఎం చంద్రబాబు దృష్టికి వ్యవహారం
- తాజాగా మరో రెండింటికి చైర్మన్‌ల ప్రకటన
- పొదిలికి ఇమాంసాహెబ్, వైపాలెంకు సుబ్బారావు
- రెండూ తెలుగుదేశం పార్టీ శ్రేణులకే

7


ఏసీబీకి పట్టుబడిన తహసీల్దార్ సృజన్‌కుమార్

ఏసీబీ వలలో మద్దిపాడు తహసీల్దార్, వీఆర్వో

- లేట్ డెత్ సర్టిఫికెట్ కోసం లంచం డిమాండ్
- రూ.90వేలు తీసుకుంటూ పట్టుబడిన వైనం
- రెవెన్యూ శాఖలో ఉలికిపాటు

వివరాలు మెయిన్‌లో..


వీఆర్వో అంకమ్మరావు

మంత్రి రవికుమార్‌కు కీలక బాధ్యతలు 7

మరిన్ని టీచర్ పోస్టులు

- జిల్లాకు 124 మంజూరు
- మెగా డీఎస్సీలో భర్తీకి అనుమతి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు (సీడబ్ల్యూఎస్ఎన్) బోధించేందుకు స్పెషల్‌గా ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. పాఠశాల విద్య చరిత్రలో మొదటిసారిగా ప్రాథమికోన్నత పాఠశాలల్లోని దివ్యాంగ విద్యార్థులకు బోధించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. భారీగా ప్రత్యేక విద్య సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులను ఇస్తోంది. ఈమేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 13 పూర్వ ఉమ్మడి జిల్లాలకు మొత్తం 2,260 ప్రత్యేక విద్య టీచర్ పోస్టులను కొత్తగా ఇచ్చారు. వీటిలో ఎస్జీటీ 1,136, ప్రత్యేక విద్య స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 1,124 ఉన్నాయి. అందులో జిల్లాకు 124 ఎస్జీటీ



స్కూలు అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేశారు.

మిగులు పోస్టుల మార్పిడి

ప్రామాణిక వైకల్యం కలిగిన పిల్లలకు మేలు చేకూరేలా ఈ టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆటిజం, మానసిక వైకల్యం, నిర్దిష్ట అభ్యసన లోపం, బుద్ధిమాంద్యం గల విద్యార్థులకు బోధించేందుకు వీలుగా ఈ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలో మిగులుగా తేలిన సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు, స్కూలు అసిస్టెంట్ పోస్టులను ఈ ప్రత్యేక విద్యా ఉపాధ్యాయ పోస్టులుగా మార్పిడి చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు ఈ కొత్తవాటికి బదులుగా 74 ఎస్జీటీ, 50 స్కూలు అసిస్టెంట్ పోస్టులు రద్దుకానున్నట్లు సమాచారం.

డీఎస్సీ అభ్యర్థులకు మేలు

1 నుంచి 5 తరగతుల వరకు దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రాల్లోనే విలీన విద్య రిసోర్స్ టీచర్లు (ఐఈఆర్టీ) బోధిస్తున్నారు. మొదటిసారిగా ప్రాథమిక పాఠశాలల్లో ప్రత్యేక టీచర్లను నియమించనున్నారు. ప్రభుత్వం ప్రకటించనున్న మెగా డీఎస్సీ ద్వారా ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ఆర్థిక శాఖ కూడా అనుమతి ఇచ్చింది. దీంతో ప్రత్యేక విద్యలో శిక్షణ పొందిన నిరుద్యోగ టీచర్లకు మేలు చేకూరనుంది.


చెరువును తలపిస్తున్న ఒంగోలులోని కర్నూల్‌రోడ్డు

తూర్పున అతలాకుతలం

ఒంగోలును ముంచెత్తిన వాన

- ఇతర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీగా
- ఉరుములు, మెరుపులు, పిడుగులు
- భయకంపితులైన జనం
- దర్శి ప్రాంతంలో నేలవాలిన పంటలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- 200 గ్రామాల్లో ఉపాధి పనులకు బ్రేక్

7


తాళ్లూరు మండలం మాధవరం వద్ద నేల వాలిన మొక్కజొన్న

నగరంలో కుండపోత

● నగర వీధులన్నీ జలమయం

● ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులు



కొప్పోలురోడ్డులో నిలిచిన వర్షపునీరు



కర్నూలు రోడ్డులో నిలిచిన వర్షపునీటిలో వాహనదారుల రాకపోకలు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రధాన వీధుల్లో వర్షపునీరు ఏరులై పారి చెరువులను తలపించాయి. ఒకవైపు ఉరుములు, మెరుపులు.. ఈదురుగాలులతో నగరం వణికింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం నెలకొంది. ఇదిలా ఉండగా సుమారు రెండు గంటల పాటు కురిసిన వానకు శివారుకాలనీల్లో పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. వంటవారికాలనీ, నెహ్రూకాలనీ, బిలాల్‌నగర్, నేతాజీకాలనీలలో పలు గృహాల్లో నీరు నిలిచి అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ప్రగతిభవన్, ఇరిగేషన్ ఆఫీస్, భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో నీరు నిలిచి వాహన రాకపోకలకు ఆటంకం కలిగింది. దారావారితోట, దేవుడుచెరువు, శర్మాకళాశాల, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, ఆర్టీసీ డిపో ఆవరణం, ఏకలవ్యనగర్, మస్తాన్ దర్గా సెంటర్‌లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులుపడ్డారు. కాగా ఇటీవల ఎండ తీవ్రత, ఉక్కపోతలతో అల్లాడిపోయిన ప్రజలు ఏకధాటిగా కురిసిన వానకు వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు.



వర్షపునీటితో నిండిపోయిన కర్నూలురోడ్డు

దేవదాయ స్థలంలో కట్టడాల తొలగింపునకు కోర్టు ఆదేశం

కూలీలతో అక్కడికి చేరుకున్న అధికారులు

నిర్మాణాలు చేపట్టిన మహిళ అడ్డుకోవడంతో వెనుదిరిగిన వైనం



కూలీలతో వచ్చిన అధికారులను అడ్డుకొంటున్న మహిళ

సింగరాయకొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన భూమిలో నిర్మించిన కట్టడాలను తొలగించాలని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం కూలీలతో కట్టడాలను కూల్చివేసేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో ఆ భూమి తనదిగా చెబుతున్న మహిళ అడ్డుకోవడంతో వెనుదిరిగారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలోని సర్వే నంబర్ 605-ఏలో ఉన్న 3 సెంట్ల భూమిలో రంగాని పద్మావతి కొంతకాలం క్రితం నిర్మాణాలు చేపట్టారు. దాన్ని తాను కొనుగోలు చేసినట్లు ఆమె చెప్తున్నారు. అయితే అది దేవదాయ శాఖకు చెందినదని, అందులో అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నారని స్థానికులు కొందరు హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన న్యాయస్థానం వెంటనే దేవదాయ స్థలంలోని నిర్మాణాలను తొలగించాలని ఆదేశించింది. దీంతో జిల్లా దేవదాయ అధికారి పానకాలరావు సర్వే నంబర్ 605-ఏలో నిర్మాణాలను తొలగించేందుకు ఆశాఖ కందుకూరు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, తొమ్మిది మంది ఈవోలు, ఏడుగురు సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు వరాహలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో పి.కృష్ణవేణితో కలిసి దేవదాయ స్థలంలో ఉన్న గదులను తొలగించడానికి బుధవారం కూలీలతో సహా అక్కడికి చేరుకున్నారు. గడ్డపారలతో కట్టడాలను తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో నిర్మాణాలను చేపట్టిన పద్మావతి అడ్డుకున్నారు. తనను చంపి ఆతరువాత గదులను కూల్చేయాలని భీష్మించారు. అయినప్పటికీ అధికారులు వెనక్కు తగ్గకపోవడంతో గడ్డపారతో తలకు కొట్టుకున్నారు. తనను కావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని కన్నీరుమున్నీరయ్యారు. దీంతో దేవదాయ అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి చేయూత



నగదును అందజేస్తున్న మురళీకృష్ణ, నాయకులు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం గుడిమెళ్లపాడు గ్రామంలో ఇటీవల టీడీపీ నాయకుడు పొడపాటి వెంకటకృష్ణ మృతి చెందగా ఆయన కుటుంబానికి కమ్మవారి సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ అండగా నిలిచారు. వెంకటకృష్ణ గృహాన్ని బుధవారం సందర్శించి ఆయన చిత్రపటానికి మురళీకృష్ణ నివాళులర్పించారు. మృతుడి భార్య, ఇద్దరు పిల్లలకు రూ.25వేల ఆర్థికసాయం అందించారు. ఇల్లు నిర్మాణం, పిల్లల చదువుకు కమ్మ సేవాసంఘం తరుపున, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సహకారంతో అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆలా హనుమంతరావు, పాటిబండ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఆరు గొర్రెలు మృతి

మరో ఆరు జీవాలకు తీవ్రగాయాలు ● వాపోయిన బాధితులు

సంతనూతలపాడు, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని ఆరు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో ఆరు జీవాలు తీవ్రగాయాలపాలైన సంఘటన బుధవారం సంతనూతలపాడులో పి.గుడిపాడు డొంక సమీపంలో చోటుచేసుకుంది. సంతనూతలపాడుకు చెందిన నలగట్ల శ్రీను, బాపట్ల వెంకటేశ్వర్లుకు చెందిన గొర్రెలు రోడ్డు పక్కన మేతమేస్తుండగా చీమకుర్తి నుంచి నెల్లూరుకు కంకరలోడ్‌తో వెళుతున్న టిప్పర్ ఢీకొంది. ఈప్రమాదంలో ఆరు గొర్రెలు చనిపోగా, మరో ఆరు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. దాదాపు రూ.3లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. సంఘటన ప్రాంతాన్ని స్థానిక టీడీపీ నాయకులు, గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘం నాయకులు కె.పెద్దబ్బాయ్ పరిశీలించారు. బాధితులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థులు నిరంతరం సాధన చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి

జరుగుమల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నిరంతర సాధన చేయడం ద్వారా జీవితంలో కచ్చితంగా విజయం సాధిస్తారని కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి డి.దేవానందరెడ్డి అన్నారు. పరీక్షలు, మార్కులు ముఖ్యం కాదని.. ఇతర రంగాలపైనా దృష్టి సారించాలని సూచించారు. మండలంలోని కె.బిట్రగుంట కేజీబీవీలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మానసికంగా కుంగిపోయకుండా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు వారిలో ఆత్మస్థయిర్యం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో జీసీడీవో హేమలత, ఎంఈవో-2 డోలా శ్రీనివాసరావు, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ కె.అనిల్‌కుమార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితులకు జీవిత ఖైదు

మద్దిపాడు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థల వివాదంలో ఒక వ్యక్తిని కర్రలతో కొట్టి చంపిన కేసులో ఇద్దరు నిందితులకు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ.భారతి జీవిత ఖైదు, రూ.5 వేలు జరిమానా విధించారు. మద్దిపాడు ఎస్‌ఐ బి.శివరామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన గొట్టిపాటి రామారావు అతని సమీప బంధువులైన నల్లూరి వెంకటరావు కుటుంబ సభ్యులకు నాలుగు గదుల ఖాళీ స్థలం గురించి వివాదం నెలకొంది. దీంతో వెంకటరావు కుటుంబ సభ్యులు కక్ష పెంచుకుని 2018 అక్టోబరు, 1వ తేదీన రామారావు తన స్థలంలో కూరగాయల మొక్కలకు పందిరి వేస్తుండగా నల్లూరి వెంకట్రావు, నల్లూరి సురేష్, నల్లూరి రాజ్యలక్ష్మి అతనిపై కర్రలతో దాడి చేసి గాయపర్చారు. దీంతో ఒంగోలులో చికిత్స పొందుతూ అతను అక్టోబరు 3వ తేదీన మరణించగా అప్పటి మద్దిపాడు ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేశారు. సాక్ష్యాలను పరిశీలించిన న్యాయాధికారి నిందితులు నల్లూరి వెంకట్రావు, సురేష్‌లకు జీవిత ఖైదు, జరిమానా విధించారు. కాగా రాజ్యలక్ష్మిపై నేరం రుజువు కాకపోవడంతో ఆమెపై కేసు కొట్టివేశారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్న వేదపండితులు

కొండపి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కొండపి గ్రామ పంచాయతీ పరిధి దాసరెడ్డిపాలెంలో నిర్మించిన రామాలయంలో సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ప్రధాన ఆచార్యులు కారంచేటి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

హైదరీ క్లబ్ అభివృద్ధికి కృషి : దామచర్ల



షాపింగ్‌కాంప్లెక్స్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, మేయర్ సుజాత

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని చరిత్ర గల ఆఫీసర్స్ అండ్ అఫిషియల్స్ హైదరీ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. క్లబ్ కమిటీ ఏడాది పూర్తికావడంతోపాటు, కమిటీ ఆధ్వర్యంలో స్థానిక క్లబ్‌లో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు బుధవారం ఎమ్మెల్యే దామచర్ల, ఎస్పీ దామోదర్, మేయర్ గంగాడ సుజాత భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో చరిత్ర గల హైదరీ క్లబ్ మరింతగా అభివృద్ధి చెందాలని, అందుకోసం తన సహకారం ఉంటుందని, ఆదాయ వనరులు పెంపొందించుకునేందుకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం అభినందనీయం అన్నారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ హైదరీ క్లబ్‌లో వివిధ క్రీడా మైదానాలు ఉండటం సంతోషంగా ఉందన్నారు. మేయర్ సుజాత మాట్లాడుతూ ఇప్పటి వరకు పురుషులకు మాత్రమే సభ్యత్వం గల హైదరీ క్లబ్‌లో నగర మేయర్‌గా తనకు తొలి సభ్యత్వం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మహిళలు కూడా సభ్యులుగా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ రాఘవ, కోశాధికారి ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీ గురునాథరావు, కమిటీ సభ్యులు సుల్తాన్‌బేగ్ (మస్తాన్), కొణిజేటి వెంకటసుబ్బయ్య, శ్రీధర్, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు మెరుగైన వైద్యసేవలు అందిస్తూ ఐకాన్‌గా నిలవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. స్థానిక కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో బుధవారం వైద్యాధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో పోల్చితే ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగిందని, ప్రైవేటు ఆస్పత్రులతో పోటీ పనిచేయాలని ఆదేశించారు. గర్భిణులకు అవసరమైన వైద్యపరీక్షలు, హైరిస్క్ కేసులు, ప్రభుత్వ ఆస్పత్రులలో జరిగే ప్రసవాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం నుంచి వచ్చే ఆర్థిక ప్రయోజనాలను అందించాలని చెప్పారు. వడగాల్పుల వల్ల ప్రాణనష్టాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ హేమంత్, డీఐవో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను అందించాలి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలను గిరిజనులకు పూర్తి స్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. అంతకుముందు ఐటీడీఏ పీవో శివప్రసాద్ గిరిజన ప్రాంతాల్లో అమలు చేస్తున్న పథకాలను వివరించారు. సమావేశంలో అధికారులు శ్రీనివాసప్రసాద్, వరలక్ష్మి, వెంకటేశ్వర్లు, బాల శంకరరావు, శ్రీనివాసరావు, డాక్టర్ బేబీరాణి, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి

● ఎమ్మెల్యే బీఎన్



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను అధికారులు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఒంగోలులోని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ కార్యాలయంలో ప్రజాదర్బార్ జరిగింది. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ ప్రజల వినతులను సంబంధిత అధికారులు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. అనంతరం నాలుగు మండలాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కుటుంబ సాధికార సారథులను నియమించాలన్నారు. మండల, గ్రామ నూతన కమిటీలను సైతం త్వరగా పూర్తిచేయాలని సూచించారు. పార్టీలో ఏ పదవి కావాలన్నా కుటుంబసాధికార కమిటీలో పేరుంటేనే అర్హులని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసరావు, నాయకులు మన్నం ప్రసాద్, ముప్పవరపు వీరయ్యచౌదరి, గొట్టిపాటి రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, మండవ జయంత్‌బాబు, తేళ్ల మనోజ్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.


ఉపాధి పనులను పారదర్శకంగా నిర్వహించాలి

● పీడీ జోసఫ్‌కుమార్

● మస్టర్లలో లోపాలపై రూ.67వేలు రికవరీకి ఆదేశాలు

చీమకుర్తి, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనుల్లో అక్రమాలు, అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం చీమకుర్తి మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికకు ఆయన హాజరయ్యారు. మండలంలోని 2023-24 ఆర్థికసంవత్సరంలో 24 పంచాయతీల పరిధి లో నిర్వహించిన ఉపాధి పనులపై డీఆర్పీలు మార్చి 19 నుంచి 29వ తేదీ వరకు సోషల్ ఆడిట్ నిర్వహించారు. మొత్తం 818 పనులకు దాదాపు 11 కోట్ల రూపాయల ఖర్చు చేశారు. ఈ పనుల్లో జరిగిన తప్పులను ఆడిట్ నిర్వహించిన ఆర్పీలు చదివి వినిపించారు. పలు గ్రామాల్లో జరిగిన మస్టర్లలో లోపాలపై రూ.67,052లను రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని వారికి వెయ్యి రూపాయలు చొప్పున రూ.29వేలు జరిమానా విధించారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖవారు ఒకపనికి రూ.1,11,384 సంబంధించిన రికార్డులు అప్పజెప్పకపోవటంపై పీడీ అసహనం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసరావు, జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఈ సునీల్ కుమార్, అజిత పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం వలేటివారిపాలెంలోని శ్రీకోదండ రామస్వామి దేవాలయం నిర్మించి తొమ్మిదేళ్లు అయిన సందర్భంగా వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా చేశారు. అర్చకులు నారాయణం కళ్యాణచక్రవర్తి, వేణుగోపాల్‌లు స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి కల్యాణ క్రతువులను నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

టైలర్ ఆత్మహత్య

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం సమతానగర్ 5వ లైన్‌లోని టైలరింగ్ షాప్‌లో టైలర్ ఉద్దడం యోగయ్య (50) బుధవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన స్థానిక సమతానగర్ 1వ లైన్‌లో నివాసం ఉంటున్నాడు. సాయంత్రం 4.30కు ఇంటి నుంచి టైలరింగ్ షాప్‌కు వెళ్ళాడు. 5.30 అయన భార్య ఫోన్ చేయగా తీయలేదు. దీంతో ఆమె షాప్ వద్దకు వచ్చి చూడగా షట్టర్ వేసి ఉంది. దీంతో షట్టర్ పైకిలేపి చూడగా షాపులోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందాడు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా నటులకు పురస్కారాల ప్రదానం

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కందుకూరి విశిష్ట పురస్కారాలను జిల్లాకు చెందిన ముగ్గురు రంగస్థల నటులు బుధవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ చేతులమీదుగా అందుకున్నారు. బుధవారం సాయంత్రం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన మిడసల మల్లికార్జునరావు, ఉన్నం వెంకట శేషయ్య, అంబడిపూడి శివప్రసాద్‌లకు మంత్రి దుర్గేష్ ప్రశంసాపత్రం, రూ.10వేల నగదు బహుమతి ఇచ్చి శాలువతో ఘనంగా సత్కరించారు.

బడి ఈడు పిల్లలు స్కూళ్లలో ఉండాలి : డీఈవో

కొత్తపట్నం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : బడి ఈడు పిల్లలు అందరూ స్కూళ్లలో ఉండాలని డీఈవో కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఈతముక్కల ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. క్లస్టర్ పరిధిలోని ఐదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్టు విజేతలు గీతిక, వైష్ణవి, పావనికి డీఈవో బహుమతులను అందజేశారు. ఎంఈవో పద్మావతి, హెచ్‌ఎం చెంచుపున్నయ్య, ఎంఈవో కిషోర్‌బాబు, డీసీబీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు నాటక దినోత్సవం

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగంపంతులు జయంతి సందర్భంగా తెలుగు నాటక రంగ దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము కళాప్రాంగణంలో శ్రీకళాప్రకాశం కళాకారులచే ప్రదర్శించిన విజయదశమి పౌరాణిక పద్యనాటకం ఆకట్టుకుంది. చిలమకూరి వెంకటకృష్ణమూర్తి రచన, చిట్టా వెంకటశివప్రసాద్ దర్శకత్వం వహించారు. అర్జునుడిగా సుబ్బయ్య, దుర్యోధనుడిగా జి.వెంకట్రామయ్య, బృహన్నలగా బాబూరావు, భీష్ముడిగా బ్రహ్మయ్య, ద్రోణుడిగా పిచ్చయ్యపంతులు, అశ్వద్ధామగా పి.శ్రీనివాసులురెడ్డి, కర్ణుడిగా ఎం.జయరాం, సుశర్మగా బాలగురవయ్య, దుశ్శాసనుడిగా ధేనువకొండ సుబ్బయ్య, ఉత్తరుడిగా జి.సుబ్బారావు తమ నటనతో ఆకట్టుకున్నారు.

రాహుల్, సోనియాలపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

● కాంగ్రెస్ పార్టీ నాయకుల డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ, సోనియాగాంధీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా డిమాండ్ చేశారు. బుధవారం ఒంగోలులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ రాహుల్‌గాంధీ, సోనియా గాంధీలపై తప్పుడు కేసులు బనాయించారని ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసును రాజకీయం చేశారని, అసత్య ఆరోపణలతో ఇరువురు నేతలపై చార్జి షీటు దాఖలు చేయడం కేంద్ర ప్రభుత్వం రాజకీయ దురుద్దేశానికి నిదర్శనం అని విమర్శించారు. ప్రధాని మోదీ బెదిరింపులకు కాంగ్రెస్ పార్టీ భయపడదన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు టి.నాగలక్ష్మి, నాయకులు కైపు వెంకటకృష్ణారెడ్డి, బీఆర్.గౌస్, శ్రీపతి సతీష్, పాలపర్తి విజేష్‌రాజ్, మన్నం ప్రసన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు రైజ్‌లో ప్రాంగణ ఎంపికలు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం కియా మోటార్స్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరుగుతాయని కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కియా మోటార్స్, ఎఆర్ఎంఎస్ బృందం ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఇంజనీరింగ్, డిప్లమో కళాశాలల విద్యార్థులు ఈ ప్రాంగణ ఎంపికలకు హాజరుకావచ్చన్నారు. విద్యార్థులు ఉదయం 9గంటలకు పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. తమ బయోడేటా, ఆధార్, పాన్‌కార్డు, మార్కుల మెమోలతో ప్రాంగణ ఎంపికలకు హాజరుకావాలని హనుమంతరావు కోరారు.

కె.పల్లెపాలెం పాఠశాలకు ఫర్నీచర్ అందజేత



ఫర్నీచర్‌ను అందజేసిన నిర్వాహకులు

కొత్తపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.పల్లెపాలెం ప్రాథమిక పాఠశాలకు ఆంధ్రప్రదేశ్ మిడ్‌వెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు బుధవారం ఫర్నీచర్‌ను అందజేశారు. పాఠశాలకు అవసరమైన ఎస్ టైపు కుర్చీలు, బీరువా, ప్లాస్టిక్ కుర్చీలు, గోడ గడియారం వంటి సామగ్రిని ఏపీఎండీసీ పీవో శివప్రసాదరెడ్డి, మిడ్‌వెస్ట్ కంపెనీ మేనేజర్ అంబటి శ్రీనివాసరెడ్డి అందించారు. ఈ సందర్భంగా మిడ్‌వెస్ట్ కంపెనీ సేవలను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనందరావు, కాపులు సైకం పోతురాజు, తమ్ము వెంకటేశ్వర్లు, సింగోతు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ నరసింహారావు, సౌత్ పల్లెపాలెం పాఠశాల హెచ్‌ఎం మస్తాన్, ఆర్‌పల్లెపాలెం హెచ్‌ఎం తిరుమలాబి, ఉపాధ్యాయులు సుబ్బారావు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డులను అందించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఈ-శ్రమ్ కార్డులు, రాష్ట్ర ప్రభుత్వం తరుపున కార్మికశాఖ ఇచ్చే కార్డులను అందించేందుకు సహకారం అందించాలని బీజేఎంసీ నాయకులు బుధవారం ఒంగోలులో ఎస్పీ దామోదర్‌ను కలిసి కోరారు. భారతీయ జనతా మజ్దూర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలీఫాతుల్లాబాషా ఆధ్వర్యంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సిద్దాంబి, రాములు స్థానిక ఎస్పీ కార్యాలయలో ఎస్పీ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ-శ్రమ్ కార్డులను పోలీస్‌శాఖలో పనిచేస్తున్న కార్మికుల కోసం ప్రత్యేక క్యాంపు నిర్వహించి అందేలా అవకాశం కల్పించాలని కోరారు.

పేస్ విద్యార్థినికి బంగారు పతకం



కావ్యను అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీధర్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎం.కావ్య రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. గుడివాడలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో 52 కేజీల విభాగంలో కావ్య ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కళశాలలో కావ్యను కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్‌లు ఆర్.వీరాంజనేయులు, సీవీ.సుబ్బారావు, కె.రూపా అక్కేష్ తదితరులు అభినందించారు.

26, 27 తేదీల్లో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడి పవన్‌కుమార్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఈనెల 26,27వ తేదీలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థాయి ఇన్విటేషన్ (పురుషుల విభాగం) బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ పావులూరి విజయ్‌కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలు ఒంగోలులోని హైదరీ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనేందుకు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని, విజేతలకు మొదటి బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, 3వ బహుమతి రూ.12 వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు అందజేస్తామన్నారు. వివరాలకు, షాహిద్‌వలీ, సెల్: 9032972973, 9866652227 ద్వారా సంప్రదించాలని కోరారు.

ఏకేయూ విద్యార్థి ప్రతిభ



బంగారుపతకం సాధించిన ప్రేమ్‌కుమార్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నార్త్ బెంగళూరు యూనివర్శిటీలో జరుగుతున్న ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ పెన్‌కేక్ సిలోట్ పోటీలో ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీ తరుపున పురుషుల జట్టులో పాల్గొన్న కె.ప్రేమ్‌కుమార్ బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక యూనివర్శిటీలో బంగారు పతకం సాధించిన ప్రేమ్‌కుమార్‌ను వైస్‌చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి, రిజిస్ట్రార్ బి.హరిబాబు తదితరులు అభినందించారు.

సీనియారిటీ జాబితాలు రూపొందించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సీనియారిటీ జాబితాలు రూపొందించి ఉద్యోగోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. బుధవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను వారు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో ఓఎంసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు పి.శిరీష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శిరీష్‌బాబు, ఆంజనేయులు, కె.ప్రభాకర్‌రావు, ఎస్‌కే.మహ్మద్‌రఫీ, చక్రవర్తి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తనిఖీలు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఎస్పీ ఏఆర్.దామోదర్ తనిఖీలు నిర్వహించారు. తొలుత డాగ్‌స్క్వాడ్ యూనిట్‌ను సందర్శించి అక్కడ పోలీసు జాగిలాలకు సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో జాగిలాలు ఇబ్బంది పడకుండా ఐదు కూలర్లు అందజేశారు. అదేవిధంగా పోలీసు క్యాంటీన్‌ను సందర్శించి అక్కడ పరిసరాలను పరిశీలిచారు. తినుబండారాలు తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా పోలీసు జిమ్ తదితర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో ఉలికిపాటు

● లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన తహసీల్దార్, వీఆర్వో

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ అవినీతిలో మునిగితేలుతోంది. ఆ శాఖలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించుకుని ప్రజలను జలగల్లా పట్టి పీల్చిపిప్పి చేస్తున్నారు. చిన్న పని, చివరికి మామూలు ధ్రువీకరణ పత్రాలు కావాలన్నా కార్యాలయాల చుట్టూ రేటు కుదిరే వరకు తిప్పుకోవడం సర్వసాధారణమైంది. మద్దిపాడు తహసీల్దార్ సృజన్‌కుమార్, దొడ్డవరం వీఆర్వో కొప్పోలు అంకమ్మ బుధవారం లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కడమే ఇందుకు నిదర్శనం. జిల్లా కేంద్రానికి పక్కన ఉన్న మద్దిపాడులో లేట్ డెత్ సర్టిఫికెటు కోసం తహసీల్దార్, వీఆర్వో రూ.90వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి వారి వలపన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ వ్యవహారంతో రెవెన్యూ వర్గాలలో కలవరం బయలుదేరింది. కొంతమంది బుధవారం సాయంత్రం కార్యాలయాలు వదిలి వెళ్లిపోయారు. అంతేకాదు పనుల కోసం నగదు తీసుకున్న సిబ్బంది సంబంధిత వ్యక్తులకు తిరిగి చెల్లింపులు చేయడం కొసమెరుపు.

పాలకేంద్రం భూములను పట్టించుకోలేదు

సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పరిధిలోని పాలకేంద్రంకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం అవుతుంటే రెవెన్యూ శాఖ అధికారులు చోద్యం చూడటం విమర్శలకు తావిస్తోంది. ఏకంగా 140/1 సర్వే నంబరులో 5 ఎకరాలు భూమిని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేసి చదును చేశారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తమకు హక్కులు ఉన్నాయి అని చెబుతూ కబ్జాకు తెరతీశారు. అయినా వారు ఎవరనేది గుర్తించలేని స్థితిలో రెవెన్యూ యంత్రాంగం ఉంది.

పాస్‌బుక్‌లకు, ఆన్‌లైన్‌కు చేయి తడపాల్సిందే

రెవెన్యూ శాఖలో నిత్యం కొత్త పాస్‌బుక్‌లు, ఆన్‌లైన్ నమోదు చేయడం, సర్వేలు, ధ్రువీకరణ పత్రాలు లాంటి పనులు ఎక్కువగా ఉంటాయి. అవే పెద్ద ఎత్తున కాసులు కురిపించే అవకాశం ఉంది. అలాగే కొన్ని కీలక పనులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఎక్కువ శాతం పనులు కాకపోవడానికి కారణం వివాదాలు ఉండటం, సరైన పత్రాలు లేకపోవడం ఒక కారణమైతే ఆశించినస్థాయిలో ఆమ్యామ్యాలు పడకపోవడం మరో కారణం. అయితే ఆ పనుల కోసం రైతులు, ఇతర వ్యక్తులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. అయితే అడిగినంత ముట్టజెబితే చాలు అవన్నీ ఆగమేఘాలపై ఇట్టే పూర్తవుతాయని విమర్శలు ఉన్నాయి. అయితే తమకు అందే మొత్తంలో చాలావరకు ఉన్నతాధికారులకు పంపాల్సి ఉంటుందని రెవెన్యూ ఉద్యోగులు బహిరంగంగానే చెబుతుండటంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక జనం అల్లాడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రెవెన్యూ శాఖపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.


హైస్కూలు ప్లస్‌లో ఉత్తీర్ణత పెంపునకు చర్యలు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని హైస్కూలు ప్లస్ ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉత్తీర్ణత పెంపునకు చర్యలు తీసుకోవాలని హైస్కూలు హెచ్‌ఎంలు, టీచర్లను ఆదేశించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో హై స్కూలు అట్టర్ ఫ్లాప్ శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథానికి ఆయన వివరణ ఇచ్చారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 226 మందికి 53 మందిపాసై 23.45 శాతం ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 122 మందికి 67 మంది పాసై 54.92 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల ఉత్తీర్ణతపై హెచ్‌ఎంలు, టీచర్లు ప్రత్యేకంగా దృష్టిసారించాలని కిరణ్‌కుమార్ కోరారు.

పార్టీ ప్రకటించింది.. ప్రభుత్వం ఆపేసింది!

● ఏఎంసీ పదవులు దక్కినా నియామకాల్లో జాప్యం
● రిజర్వేషన్ల విషయంలో సీఎస్ కొర్రీలే కారణం
● వై.పాలెం, పొదిలి కూడా టీడీపీ శ్రేణులకే

నామినేటెడ్ పదవుల విషయంలో అధికార కూటమి పార్టీలు దూకుడుగా వ్యవహరించినా నియామక ఉత్తర్వుల జారీలో జాప్యం జరుగుతోంది. అందుకు ప్రస్తుతం జరుగుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకమండలి నియామకాలే నిదర్శనం. ఇప్పటికే మూడు జాబితాల ద్వారా అత్యధిక చైర్మన్ పదవుల నియామకాలకు టీడీపీ గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. రాష్ట్రస్థాయిలో కొన్ని పదవులను జనసేన, బీజేపీలకు కూడా కేటాయించింది. తొలి జాబితాలో వారికే ఇంతవరకు నియామకాలు దక్కలేదు. రిజర్వేషన్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కొర్రీలు పెట్టడమే కారణమనే చర్చ నడుస్తోంది.



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మూడు మినహా మిగిలిన ఏఎంసీ చైర్మన్ల నియామకాలకు అభ్యర్థులను టీడీపీ అధిష్ఠానం ప్రకటించింది. తదనుగుణంగా ఆయా కమిటీల మిగిలిన సభ్యుల జాబితాను కూడా కిందిస్థాయిలో మార్కెట్ కమిటీల అధికారులకు అందాయి. వాటిని పరిశీలించి కమిటీల జాబితాలను ఉన్నతాధికారులకు కూడా పంపారు. ఈ ఎంపికల్లో భాగంగా టీడీపీ తొలిజాబితా విడుదలచేసి సుమారు నెలరోజులైంది. బుధవారం మరో జాబితాను కూడా విడుదల చేశారు. ఇప్పటివరకు విడుదలైన మూడు జాబితాల్లో ఉమ్మడి జిల్లాలోని ఒంగోలు, కొండపి, కందుకూరు ఏఎంసీలు మినహా మిగిలిన వాటికి చైర్మన్ల ఎంపిక జరిగిపోయింది. కానీ తొలి జాబితాలో సుమారు నెలరోజుల క్రితం చైర్మన్‌గా ఎంపికైనట్లు ప్రకటించిన వారి నియామక ఉత్తర్వులు ఇంతవరకు ప్రభుత్వం విడుదల చేయలేదు. తొలి జాబితాలో మార్కాపురం ఏఎంసీ చైర్మన్‌గా ఎంపిక చేసిన అభ్యర్థి పేరును ప్రకటించారు. ఆయన ఈనెల 20వ తేదీ బాధ్యతల స్వీకరణకు ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. ఎమ్మెల్యే చేత మంత్రికి, ఉన్నతాధికారులకు చెప్పించుకుని ఉత్తర్వుల కోసం రాష్ట్ర కార్యాలయం చుట్టూ తిరిగారు. కానీ నియామక ఉత్తర్వులు రావటానికి ఇంకా సమయం ఉందని తెలిసి 20వ తేదీ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. వ్యవసాయ మార్కెట్ రాష్ట్ర కార్యాలయంలో ఈ నియామక ఉత్తర్వులు రావటానికి పెద్ద తంతే జరుగుతోంది.

గజిబిజి గందరగోళం ఇలా...

నిజానికి రిజర్వేషన్ల నిర్ణయంలో జిల్లాను యూనిట్‌గా తీసుకున్నారు. అయితే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల నుంచి వచ్చిన వత్తిళ్లతో కొన్నిమార్పులు చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఒక ఏఎంసీ చైర్మన్ పదవి ఓసీ జనరల్ నుంచి ఎస్సీ జనరల్‌కు మార్చుకోవాలంటే వేరే జిల్లాలో ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ అయిన స్థానాన్ని ఓసీ జనరల్‌కు మార్చుకునేందుకు వారు అంగీకరిస్తే ఇద్దరూ మాట్లాడుకుని మార్చుకునే విధానాన్ని అవలంబించినట్లు సమాచారం. దాంతో రిజర్వేషన్ అమలులో స్పష్టత లేకుండా కాస్తంత గజిబిజి వాతావరణం కనిపించింది. ఇదే అనుమానం వ్యక్తంకావటంతో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నియామకాలను ఆపివేసినట్లు సమాచారం. చివరికి ఈ అంశం సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. దీంతో పార్టీపరంగా ప్రస్తుతం జరిగిన అభ్యర్థుల ఎంపిక ప్రకారం ప్రభుత్వ నియామక ఉత్తర్వులు వెలువడుతాయా లేక అందులోనూ మార్పులు చోటుచేసుకుంటాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఇద్దరూ పాతకాపులే

తెలుగుదేశం పార్టీ బుధవారం ఎంపికచేసిన వై.పాలెం, పొదిలి ఏఎంసీ చైర్మన్ అభ్యర్థులు కూడా రాజకీయంగా టీడీపీ విధానాలకు కట్టుబడి ముందు నుంచీ పనిచేస్తున్నవారే. ఎర్రగొండపాలెం ఏఎంసీ చైర్మన్ పదవి జనరల్ కేటగిరీలో రిజర్వ్‌కాగా రెడ్డి, కమ్మ సామాజికవర్గ పార్టీశ్రేణుల నుంచి పోటీ ఏర్పడింది. రెడ్డి సామాజికవర్గం వారికి వేరే పదవులకు సిద్ధంకావటంతో కమ్మ సామాజికవర్గం వారినే ఎంపికచేయాలని ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు రాష్ట్ర పార్టీకి సూచించారు. అయితే ఒక అభ్యర్థిని సూచించలేక ముగ్గురు పేర్లను పార్టీ పరిశీలనకు పంపారు. అందులో ఆరంభం నుంచీ టీడీపీలో ఉంటూ ప్రత్యేకించి గత వైసీపీ ప్రభుత్వంలో ఎవరూ ముందుకురాని సమయంలో ముందుకొచ్చి మండల పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి ఇప్పటికీ ఆ పదవిలో కొనసాగుతున్న సుబ్బారావుకు రాష్ట్రస్థాయి అవకాశమిచ్చింది. పొదిలి ఏఎంసీ పదవి బీసీ మైనారిటీకి రిజర్వ్‌కాగా పూర్వం నుంచి పార్టీలో ఉన్న ఆర్‌ఎంపీ డాక్టరు ఇమామ్‌షా పేరును ఎమ్మెల్యే నారాయణరెడ్డి సూచించగా అధిష్ఠానం ఆయనను ఎంపిక చేయటం విశేషం.

సీఎస్ కొర్రీనే కారణం

చైర్మన్ పదవుల రిజర్వేషన్ల విధానంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తంచేసిన అభ్యంతరమే నియామకాలు ఆగిపోవటానికి కారణమని తెలిసింది. రిజర్వేషన్లు జిల్లా యూనిట్‌గా చేశారా లేక రాష్ట్రం యూనిట్‌గా చేశారా అనే విషయంపై స్పష్టతనివ్వాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి వ్యవసాయశాఖ ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిసింది. యూనిట్‌గా జిల్లాను లేక రాష్ట్రాన్ని తీసుకున్నా తదనుగుణంగా రిజర్వేషన్లు జరిగాయా లేదా అనేది కూడా వివరించాలని కోరినట్లు తెలిసింది. ఈ సందేహాలకు వివరణ ఇచ్చేందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు కుస్తీ పడుతున్నారు. చివరికి విషయం ముఖ్యమంత్రి వద్దకు కూడా చేరినట్లు తెలిసింది.

పొదిలి ఏఎంసీ చైర్మన్‌గా ఇమామ్‌సాహెబ్

పొదిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సయ్యద్ ఇమామ్‌సాహెబ్‌ను టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఎన్ని అవరోధాలు వచ్చినా ఆది నుంచి టీడీపీ కోసం పనిచేసిన వ్యక్తిగా మంచి గుర్తింపు ఉంది. గతంలో జన్మభూమి కమిటీ సభ్యుడిగా, 2004లో గ్రామ పంచాయతీ వార్డ్ సభ్యునిగా ఆ తరువాత 2014లో మండలపరిషత్ ఎన్నికల్లో పొదిలి - 4 ఎంపీటీసీగా అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. ప్రస్తుతం యూనిట్ ఇన్‌చార్జిగా, పొదిలి పట్టణ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. తనపై నమ్మకంతో ఇంతటి పెద్ద పదవిని కట్టబెట్టడానికి కారణమైన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రగొండపాలెం ఏఎంసీ చైర్మన్‌గా చేకూరి సుబ్బారావు

● బాణసంచా కాల్చి స్వీట్లు పంచిన టీడీపీ కార్యకర్తలు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన చేకూరి సుబ్బారావును టీడీపీ అధిష్ఠానం బుధవారం నియమించింది. పార్టీ ఆవిర్భావం నుంచి సుబ్బారావు టీడీపీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తున్నారు. 2001, 2006లో మొగుళ్ళ పల్లి గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. 2020 నుంచి నేటి వరకు ఎర్రగొండపాలెం టీడీపీ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఎరిక్షన్‌బాబుకు ప్రధాన అనుచరుడుగా ఉన్నారు.

టీడీపీ కార్యకర్తల హర్షం

ఏఎంసీ చైర్మన్‌గా సుబ్బారావును అధిష్ఠానం నియమించిన విషయం తెలియగానే టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం ఎదుట టీడీపీ కార్యకర్తలు బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారు.



ఎర్రగొండపాలెంలో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట బాణసంచా పేల్చి స్వీట్లు పంచుకుంటున్న టీడీపీ కార్యకర్తలు

తెలుగువారి ఆత్మగౌరవం అమరజీవి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ● కనిగిరిలో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలు ప్రారంభం

కనిగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : తెలుగు ప్రజల కోసం, వారి హక్కుల కోసం అమరజీవి తన ప్రాణాల్నే త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అని, ఆయన తెలుగువారి ఆత్మగౌరవం అని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలను బుధవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. కందుకూరు రోడ్డులోని ఎంబీఆర్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల ప్రకారం అమరజీవి జయంతి ఉత్సవాలను కనిగిరిలో జరుపుకోవటం ఎంతో ఆనందించదగిన విషయన్నారు. కనిగిరి నియోజకవర్గంలో పీసీపల్లి మండలం పడమటిపల్లి అమరజీవి స్వస్థలం కావటం ఈ ప్రాంత ప్రజల అదృష్టంగా భావించాలని చెప్పారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ అమరజీవి ఏ సామాజిక వర్గానికీ చెందినవారు కాదని తెలుగుజాతి మొత్తానికి చెందినవాడన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ అన్సారియా

జనార్దన్ మాట్లాడుతూ అమరజీవి ఆశయాలను భావితరాలు స్ఫూర్తిగా తీసుకుపోవటమే మహనీయునికి నిజమైన నివాళి అన్నారు. ఏప్రిల్ 16, 2025 నుంచి ఏప్రిల్ 16, 2026 వరకు ప్రభుత్వం అమరజీవి జయంతి ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహిస్తోందని చెప్పారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు కార్యసాధకుడని కొనియాడారు. అమరజీవి అందించిన త్యాగానికి గుర్తుగా ఆయన పుట్టిన గ్రామం దేశ చరిత్రలో నిలిచిపోయేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుండటంతో సీఎం చంద్రబాబుకు ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. అమరజీవి పొట్టి శ్రీరాములు పుట్టిన పడమటిపల్లెలో ఆయన నివసించిన ఇంటి వద్ద ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని చెప్పారు. తొలుత అమరజీవి విగ్రహానికి పలువురు ప్రముఖులతో కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు వారసులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, ఏపీ మాలల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ చైర్మన్ డాక్టర్ విజయ్‌కుమార్, దర్శి, వైపాలెం టీడీపీ ఇన్‌చార్జులు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబు, మున్సిపల్ చైర్మన్ గఫార్, టీడీపీ వాణిజ్య విభాగం నాయకులు వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి), ఐవీ నారాయణ, మారుతి, సత్యాలు పాల్గొన్నారు.

మంత్రి రవికి కీలక బాధ్యతలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)



ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు పార్టీలో కీలక బాధ్యతలను అప్పగించారు. సీఎం చంద్రబాబు ఇటీవల అటు ప్రభుత్వంలోనూ, ఇటు పార్టీ వ్యవహారాల్లోనూ మంత్రి రవికుమార్‌కు సముచిత ప్రాధాన్యత ఇస్తూ అనేక సందర్భాల్లో ఆయనతో ప్రత్యేకంగా భేటీ అవుతున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రవికుమార్‌కు పార్టీపరంగా కీలక బాధ్యతలను చంద్రబాబు అప్పగించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకుపోయే అంశంపై టీడీపీ అధిష్ఠానం ఇప్పటికే దృష్టిసారించి పలురకాల సమీక్షలు నిర్వహించింది. తదనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ పరంగా ఒక ప్రత్యేక కమిటీ నియమించారు. ఆ కమిటీలో మంత్రి రవికుమారకు స్థానం కల్పించడం విశేషం. కేవలం ఏడుగురితో ఏర్పాటు చేసిన ఆ కమిటీలో రవికుమార్‌కు అవకాశం లభించింది. అంతేగాక బుధవారం సాయంత్రం సీఎం చంద్రబాబు రవికుమార్‌ను ప్రత్యేకంగా పిలిపించుకుని ఎన్నికల కమిటీ ఏర్పాటు ఆవశ్యకతను, బాధ్యతను వివరించి ఆయన్ను ఒప్పించి కమిటీలో సభ్యుడిగా నియమించారు. సీనియర్ నేత వర్ల రామయ్య అధ్యక్షుడిగా నియమితులైన ఈ కమిటీలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు కూడా ఈ కమిటీలో ఒక సభ్యుడిగా ఉన్నారు.

డైట్ పోస్టులకు రాత పరీక్ష వాయిదా

ఒంగోలు విద్య, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మైనంపాడులోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో ఖాళీగా ఉన్న ఆరు సీనియర్ లెక్చరర్, 17 లెక్చరర్ పోస్టులు కలిపి 23 పోస్టులకు బుధవారం నిర్వహించాల్సిన ట్యాబ్ ఆధారిత రాత పరీక్షను ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ వాయిదా వేసినట్లు డీఈవో కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులను డిప్యూటేషన్ విధానంలో భర్తీ చేసేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. మళ్లీ పరీక్ష ఈనె 17, 19 తేదీల్లో ఉంటుందని ప్రకటించారు.

జిల్లాలో 10.5 మి.మీ. వర్షపాతం నమోదు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 10.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. సంతనూతలపాడు 60.8, ఒంగోలు 55.4, తాళ్లూరు 45.8, దర్శి 40.4, టంగుటూరు 28.0, జరుగుమల్లి 24.2, సింగరాయకొండ 22.2, కొండపి 21.4మి.మీ. వర్షపాతం నమోదైంది. కొత్తపట్నం 20.4, మద్దిపాడు 20.2. నాగులుప్పలపాడు 18.4, కురిచేడు 13.0, చీమకుర్తి 7.4, ముండ్లమూరు 5.2, పొన్నలూరు 4.2, పామూరు 3.4, వెలిగండ్ల 3.0, అర్థవీడు 2.2, యర్రగొండపాలెం 2.0, పొదిలి 2.0, దోర్నాల 1.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

తూర్పున అతలాకుతలం

ఒంగోలును ముంచెత్తిన వాన

ఇతర చోట్లా మోస్తరు నుంచి భారీగా

ఉరుములు, మెరుపులతో పిడుగులు

దర్శి ప్రాంతంలో నేలవాలిన పంటలు

200 గ్రామాల్లో ఉపాధి పనులకు బ్రేక్

ఒంగోలు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని తూర్పుప్రాంతాన్ని బుధవారం ఉదయం అకాల వర్షం ముంచెత్తింది. ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల్లోని పలు మండలాలతోపాటు దర్శి ప్రాంతంలోనూ ఒక మోస్తరు నుంచి భారీవాన కురిసింది. ఒంగోలు నగరంలో తెల్లవారుజామున వర్షం దంచికొట్టింది. దర్శి ప్రాంతంలో పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో పదిరోజుల నుంచి ఎండల తీవ్రత పెరిగింది. అదేసమయంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో వర్షం, గాలులు అధికంగా ఉంటున్నాయి. ఈక్రమంలో బుధవారం తెల్లవారుజామున జిల్లా తూర్పుప్రాంతంలో దాదాపు రెండు, మూడు గంటల పాటు పెద్దఎత్తున ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం పడింది. ఒంగోలు నగరాన్ని అయితే వాన ముంచెత్తింది. జిల్లాలో సగటున బుధవారం ఉదయం 10.50 మి.మీ వర్షపాతం నమోదైంది. అందులో అత్యధికంగా ఎస్‌ఎన్‌పాడు మండలంలో 60.8 మి.మీ కురవగా ఒంగోలులో 55.4, తాళ్లూరులో 45.8, దర్శిలో 40.80, టంగుటూరులో 28.0, జరుగుమల్లిలో 24.2, కొండపి 22.2, కొత్తపట్నంలో 20.4, మద్దిపాడులో 20.2, ఎన్‌జీపాడులో 18.4 మి.మీ కురిసింది. మరికొన్ని మండలాల్లో జల్లులు పడ్డాయి.

నగరం జలమయం

బుధవారం తెల్లవారుజామున అందరూ నిద్రలేచే సమయంలో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వాన కురిసింది. దీంతో జనం భయకంపితులయ్యారు. ప్రత్యేకించి ఒంగోలు నగరంలో తెల్లవారేసరికి ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. ప్రధానమైన రోడ్లపై రెండు, మూడు అడుగుల ఎత్తులో నీరు పారింది. మరోవైపు దర్శి నియోజకవర్గంలో ప్రత్యేకించి దర్శి, కురిచేడు మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రస్తుతం పొలంలో ఉన్న వరి, మొక్కజొన్న, సజ్జ వంటి పంటలు నేలవాలాయి. చీమకుర్తి, ఎస్‌ఎన్‌పాడు, కొత్తపట్నం, సింగరాయకొండ, ఎన్‌జీపాడు మండలాల్లో కూడా పొలంలో ఉన్న కూరగాయలు, ఇతర పశుగ్రాస పంటలకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. అలాగే విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.



ఒంగోలులో వర్షానికి రోడ్డుపై నిలిచిన నీరు

ఉపాధి పనులకు ఆటంకం

ఈ వర్షంతో జిల్లాలో ఉపాధి హామీ పనులకు తీవ్ర అంతరాయం కలిగింది. అనేక గ్రామాల్లో బుధవారం పనులు నిలిచిపోయాయి. జిల్లాలోని 715 పంచాయతీల్లో నిత్యం సుమారు లక్షా 10వేల మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు. బుధవారం వర్షం కారణంగా 212 గ్రామాల్లో పనులు ఆగిపోయాయి. మిగిలిన గ్రామాల్లో సుమారు 84వేల మంది పనులకు వచ్చినట్లు సమాచారం. అంటే వర్షంతో దాదాపు 25వేల మంది ఉపాధి కూలీలు పనులకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది.

486 హెక్టార్లలో పంటలకు నష్టం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కురిసిన అకాల వర్షానికి 486.40 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యవసాయశాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం నాలుగు మండలాల్లోని 20 గ్రామాలకు చెందిన 562 మంది రైతుల పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. వరి 52 హెక్టార్లు, మొక్కజొన్న 178.40హెక్టార్లు, అలసంద 10హెక్టార్లు, శనగ 246 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. టంగుటూరు మండలంలో 11 గ్రామాలు, సీఎస్‌పురం మండలంలో 3 గ్రామాలు, వెలిగండ్ల మండలంలో ఒక గ్రామం, బేస్తవారపేట మండలంలో ఐదు గ్రామాల్లో ఆయా పంటలు దెబ్బతినగా ఆయా వివరాలను అధికారులు ప్రాథమికంగా ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం.

అవీ..ఇవీ


విద్యార్థులను అభినందిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

శ్రీచైతన్య పాఠశాల విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ఐఎన్‌టీఎస్‌వో లెవెల్-2 పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా బుధవారం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ విద్యార్థులను అభినందించారు. వల్లపునేని ఆరుషి, దీపక్ టాప్స్ సాధించి తమ ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం అంజయ్య, ఆర్ఐ సురేంద్ర, కోఆర్డినేటర్ వీరాంజనేయులు, డీన్ సీహెచ్ శ్రీనివాసులు, ఏవో కృష్ణారెడ్డి, ప్రైమరీ ఇన్‌చార్జ్ ప్రమీల పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల నిరసన

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు సుబ్బరాయుడు మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు విరమించుకోవాలన్నారు. దళారీ వ్యవస్థను రూపుమాపాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా 62 సంవత్సరాల రిటైర్‌మెంట్‌ను కాంట్రాక్ట్ కార్మికులకు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.హరి, షేక్ ఇమాంసా, యూసుఫ్, మరియదాసు, అల్లూరయ్య, వెంకటయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గిరిజనులకు అవగాహన

ఎర్రగొండపాలెం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కల్పిస్తున్న పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ఎర్రగొండపాలెం ప్రత్యేకాధికారి కె. నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని వెంకాద్రిపాలెం, అంకమ్మ గూడెం, బిల్లగొంది, పునరావాస కాలనీ, వీరభద్రాపురం, పోతురాజు పెంట, హనుమంతుని గూడెంలోని గిరిజనకుటుంబాలతో సమావేశం నిర్వహించారు.

డెంగ్యూతో మాజీ సర్పంచ్ మృతి

● ఆలస్యంగా వెలుగులోకి..

పొదిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏలూరు గ్రామంలో డెంగ్యూ లక్షణాలతో మాజీ సర్పంచ్ దర్శవరపు సుబ్బారావు శనివారం మృతి చె ందాడు. ఈవిషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలిసిన వివరాల ప్రకారం సుబ్బారావు అనారోగ్యానికి గురయ్యారని అనంతరం విజయవాడ ప్రైవేటు వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. వైద్యశాలలో పలురకాల వైద్యపరీక్షలు చేసినట్లు చెప్పారు. అప్పటికే సుబ్బారావు ఆరోగ్యం క్షీణించడంతో అదేరోజు మృతి చెందాడు. అయితే శనివారం చేసిన వైద్య పరీక్షల నివేదిక బుధవారం వచ్చింది. అందులో డెంగ్యూ లక్షణాలు ఉన్నాయని రిపోర్ట్ వచ్చిందన్నారు. అయితే మృతునికి ఊపిరితిత్తులు, గుండె సంబంధిత ఇబ్బందులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

టీడీపీ హయాంలోనే కొమరోలు అభివృద్ధి

పుల్లలచెరువు,ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కొమరోలు పంచాయతీలో అభివృద్ధి పనులు జరిగాయని టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మంగళవారం రాత్రి పుల్లలచెరువు మండలంలోని కొమరోలులో పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా టీడీపీ గ్రామ నాయకుడు గోనుగుంట్ల గాలెయ్య ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పుల్లలచెరువు మండలం జిల్లాలోనే వెనుకబడి ఉందని అన్నారు.కరువు శాశ్వతంగా తీరాలంటే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, బైరపునేని వెంకటేశ్వర్లు, గోనుగుంట్ల గాలెయ్య, వెంకట్రామయ్య, ఎంపీటీసీ మూర్తయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి మస్తానయ్య స్వామి ఉరుసు

పుల్లలచెరువు,ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొత్తూరులో వెలసిన మస్తానయ్య స్వామి ఉరుసు మహోత్సవం మూడు రోజుల పాటు వైభవంగా జరుగనున్నది. గురువారం నుంచి మూడు రోజుల పాటు గ్రామస్థుల ఆధ్వర్యంలో ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నారు. గురువారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు.

తహసీల్దార్ లేక అవస్థలు

అవినీతి ఆరోపణలతో ఒకరు, సమస్యలు పరిష్కరించలేనని మరొకరు సెలవులో..

అర్జీలు పరిష్కారం కాక ప్రజల ఇబ్బందులు



తర్లుపాడు తహసీల్దార్ కార్యాలయం

తర్లుపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఎప్పుడూ తాళం వేసి ఉంటోంది. వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు తహసీల్దార్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలల క్రితం తర్లుపాడు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జయవర్ధన్ రెడ్డి విద్యార్థుల సర్టిఫికెట్‌లకు డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు దీర్ఘకాల సెలవుపై వెళ్లారు. అప్పటి నుంచి డిప్యూటీ తహసీల్దార్ విజయ్ భాస్కర్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కొంత కాలం క్రితం జరిగిన రెవెన్యూ సదస్సుల సమయంలో మండలంలోని సమస్యలు పరిష్కరించటం తనవల్ల కాదంటూ సెలవు పెట్టి వెళ్లిపోయారు. దీనిపై అధికారులు మందలించటంతో ఐదు రోజుల తర్వాత విధులకు హాజరయ్యారు. ఇటీవల మళ్లీ 15 రోజుల పాటు దీర్ఘకాల సెలవుపై వెళ్లారు. దీంతో వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. సర్టిఫికెట్‌లకు సంతకాల కోసం విద్యార్థులు నానా అవస్థలకు గురవుతున్నారు. అలాగే మూడేళ్ల నుంచి ఆర్ఐ పోస్టు ఖాళీగా ఉంది. తర్లుపాడు, మీర్జపేటలో కనీసం వీఆర్‌వోలు కూడా లేకపోవటంతో ఆ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను ఇప్పటి వరకు 50 శాతం కూడా పూర్తి చేయలేదు. జిల్లా అధికారులు చెప్తున్నప్పటికీ తర్లుపాడు తహసీల్దార్ కార్యాలయంలో మాత్రం ఆ సమస్యలు అలాగే ఉండిపోతున్నాయి. సమస్యలు ఎప్పటికి పరిష్కారం అవుతాయోనంటూ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నూతన తహసీల్దార్‌ను నియమించి మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ అన్నారు. స్థానిక జీఎస్ఆర్ అపార్ట్‌మెంట్‌లో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అపార్ట్‌మెంట్‌లలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు లిఫ్ట్‌ను వాడకుండా మెట్ల మార్గం ద్వారా బయటకి రావాలన్నారు. గృహాలలో జరిగే గ్యాస్ లీకుల ప్రమాదాలు, నివారణ ప్రయోగాత్మకంగా వివరించారు. గృహాలలో ఎంసీబీలను వాడటం ద్వారా అగ్నిప్రమాదాలు జరగవని, విద్యుత్ వైరింగ్‌లో కూడా క్వాలిఫైడ్ ఎలక్ట్రీషియన్ ద్వారా తనిఖీ చేయించాలన్నారు.వివిధ అంశాలు డెమో ద్వారా వివరించారు.


సిలిండర్ నుంచి వచ్చే మంటలను ఎలా నివారించాలో ప్రయోగాత్మకంగా సూచిస్తున్న అధికారి

మహిళలకు అవగాహన

ఎర్రగొండపాలెం : అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ ఎఫ్‌వో డి. మాల్యాద్రి అన్నారు. అగ్నిప్రమాదాల వారోత్సవాల్లో భా గంగా బుధవారం ఎర్రగొండపాలెంలోని సిరి అపార్ట్‌మెంటు వద్ద మహిళలకు అవగాహన కల్పించారు. అపార్టుమెంట్‌లలో వంట గదిలో గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీకై వాసన వస్తే వెంటనే సిలిండర్ రెగ్యులేటర్ బటన్ స్విచ్ ఆపుకోవాలని సూచించారు. రెగ్యులేటరు వద్ద ఆఫ్ చేయడానికి వీలు లేకుండా మంటలు వ్యాపిస్తే ఇంటిలో అందుబాటులో వరిపిండి, గోధుమ పిండి చల్లి మంటలు అదుపుచేయాలని లేకుంటే తడిగోనె సంచి, తడి దుప్పటి కప్పి మంటలను అదుపు చేయవచ్చునని సూచించారు. అగ్ని ప్రమాదంను గుర్తించి వెంటనే అగ్నిమాపక కేంద్రం ఫోన్ నెంబరు 08403 254244 లేక టోల్‌ఫ్రీ నెంబరు 101 ఫోన్ చేసి సమాచారం అందించాలని అన్నారు. ఫైర్ సిబ్బంది మహిళలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

కంభంలో..

కంభం : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం కంభం అర్బన్‌కాలనీ, రైల్వేస్టేషన్ ఆవరణలో అపార్ట్‌మెంట్ వద్ద ప్రజలకు అగ్నిప్రమాదాలపై తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ పిచ్చయ్యచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

● జయంతి ఉత్సవాలలో పాల్గొనేందుకు తరలి వెళ్లిన ఆర్యవైశ్యులు


గిద్దలూరులో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

గిద్దలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి ఉత్సవాలలో పాల్గొనేందుకు స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో కనిగిరికి తరలివెళ్లారు. ఇందులో భాగంగా స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు కోల్పో యి తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చిన పొట్టిశ్రీరాములును నేటితరం గుర్తు పెట్టుకోవాలని, ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సూరె నాగేశ్వరరావు, వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థాన అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, ఆవోపా అధ్యక్షుడు దారా రాములు, వాసవిక్లబ్, వాసవి జాగృతి, వాకర్స్‌క్లబ్, పలు దేవస్థాన కమిటీ ప్రతినిధులు, బీజేపీ ఉపాధ్యక్షులు బీవీ రామాంజనేయులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు.

మహనీయులను స్మరించుకోవడం అదృష్టం : ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల :సమాజసేవలో ప్రాణాలు సైతం అర్పించిన మహ నీయులను స్మరించుకోవడం మన అదృష్టమని టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలను బుధవారం నిర్వహించారు. స్థానిక నటరాజు కూడలిలోని శ్రీరాములు విగ్రహానికి ఎరిక్షన్ బాబు, టీడీపీ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కనిగిరికి తరలిన ఆర్యవైశ్యులు

మార్కాపురం వన్‌టౌన్ : కనిగిరి పట్టణంలో నిర్వహించనున్న పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలకు మార్కాపురం నుంచి ఆర్యవైశ్యులు బుధవారం భారీగా తరలివెళ్లారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద శ్రీరాములు విగ్రహానికి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జునరావు, చెన్నకేశవ స్వామి ఆలయ మాజీ చైర్మన్ యక్కలి కాశీవిశ్వనాథం, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పాలుట్లలో బాలింతలకు సామూహిక సీమంతాలు చేస్తున్న అధికారులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బాలింతలకు, గర్భిణులకు, 6 సంవత్సరాల లోపు చిన్నారులకు పౌష్టికాహారం తింటేనే ఆరోగ్యంగా ఉంటారని ఎర్రగొండపాలెం సీడీపీవో ఎం. పద్మావతి అన్నారు. బుధవారం మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని పాలుట్ల గిరిజన గూడెంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెంలోని గిరిజన మహిళలకు సాముహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గూడెంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎ. పద్మజ, కేవీ సుబ్బమ్మ, ఎన్. శివలక్ష్మి, ఎం. హైమావతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలి :గర్భిణులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సుమారు 50మంది గర్భిణులకు సీమంతాలు చేసి పౌష్టికాహారం, ఐరన్ మాత్రలు అందించారు.

మార్కాపురం వన్‌టౌన్ : పోషకాహారంతోనే మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని మార్కాపురం సీడీపీవో సుశీలాదేవి అన్నారు. స్థానిక ఏకలవ్య కాలనీలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ, పోషకాహార ప్రదర్శనలు నిర్వహించారు.

టీడీపీ నాయకుడికి ఘననివాళి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఒంగోలు పార్లమెంటు అధికార ప్రతినిధి షేక్ మహబూబ్‌బాషా మంగళవారం మృతి చెందగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట పట్టణ మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, నంది శ్రీను, ఓబయ్య ఉన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని అర్బన్ సీఐ కె.సురేష్ అన్నారు. పట్టణంలోని ఏబీఎం పాలెంలో మత్తు పదార్థాలపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయనపాల్గొని మాట్లాడారు.

జనసేన, కూటమి అభివృద్ధికి కృషి చేస్తా

కంభం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రాణం ఉన్నంత వరకు తాను, తన వర్గమంతా కంభం, అర్ధవీడు మండలాల్లోని జనసేన, కూటమి అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తామని కంభం, అర్ధవీడు మండలాల జనసేన నాయకుడు కాసుల పాండు తెలిపారు. బుధవారం కంభంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంత మంది స్వార్థపరులు నా ఎదుగుదలను చూసి ఓర్వలేక వైసీపీ నాయకుడని దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

21 నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు

గిద్దలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మండలం బురుజుపల్లి గ్రామంలో ఈనెల 21 నుంచి 23వ తేది వరకు గంగాభవాని దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు తెలిపారు. 21న ప్రత్యేక పూజలు, అభిషేకాలు, 22న హోమాలు, గ్రామోత్సవం, 23న గంగా భవాని సహిత సింహ వాహనం, శిఖర ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బండలాగుడు పోటీలు

ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఈనెల 23వ తేదీ బుధవారం బురుజుపల్లె గ్రామం లో సీనియర్స్ విభాగంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులను అందచేయనున్నారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.1లక్ష, రూ. 80వేలు, రూ. 60 వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ. 20వేలు, రూ.10వేలు, రూ.5వేలు బహుమతిగా ఇస్తామని, 1000 రూపాయల ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కాశినాయనకు ప్రత్యేక పూజలు

పట్టణంలోని కాశినాయన ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సామూహికంగా భజనలు చేశారు. దాతల సహకారంతో పేదలకు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలలో యోగా గురూజీ నారాయణరెడ్డి, దేవస్థాన కమిటీ ప్రతినిధులు, దాతలు పాల్గొన్నారు.


మంత్రి లోకేష్ నుంచి షైనింగ్ స్టార్ అవార్డు అందుకుంటున్న చాతుర్య

చాతుర్యకు షైనింగ్ స్టార్ అవార్డు

● అందించిన మంత్రి లోకేష్

కంభం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ హెచ్‌ఈసీ గ్రూపులో 980/1000 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన తమ్మినేని చాతుర్యకు మంత్రి నారా లోకేష్ షైనింగ్ స్టార్ 2025 అవార్డును అందజేశారు. ఈసందర్భంగా చాతుర్య మాట్లాడుతూ తాను పేద కుటుంబాన్నుంచి వచ్చానని, తన విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లోనే జరిగిందని తెలిపారు. తన చిన్నతనంలో తల్లి వెళ్లిపోవడంతో తండ్రి కష్టపడి చదివించాడని, తన విద్యాభివృద్ధి సహకరించాలని నారా లోకేష్‌ను కోరారు. ఐఏఎస్ సాధించాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. స్పందించిన నారా లోకేష్ బాలికను అభినందిస్తూ చదువుకు అయ్యే ఖర్చును తాము భరిస్తామని హామీ ఇచ్చి ల్యాప్ టాప్‌ను బహూకరించారు.


కాలనీవాసులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బారావు

అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

● కార్డన్ సెర్చ్‌లో పోలీసులు

మార్కాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు అన్నారు. స్థానిక ఏకలవ్య కాలనీలో బుధవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ముందుగా ఆ ప్రాంతంలోని అన్ని వాహనాలను పరిశీలించారు. వాటి ధ్రువీకరణ పత్రాలు సరిచూశారు. అంతేకాక కొందరు అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. చెడునడత కలిగి, గతంలో కేసుల్లో ఉన్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. అనుమానం అన్ని కోణాల్లో సోదాలు చేశారు. ఈ క్రమంలో సుమారు 5 ఆటోలు, 18 మోటార్ సైకిళ్లకు సంబంధించి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో వాటిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కొత్త వ్యక్తులు తారసపడితే వారి నడవడికపై ఎలాంటి అనుమానం ఉన్నా పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు ఎం.సైదుబాబు, డాక్టర్ ఎం.రాజమోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలి బస్టాండ్‌ను పరిశీలించిన ఆర్ఎం

పొదిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పొదిలి బస్టాండ్‌ను ఆర్ఎం వెంకట్రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్సురూట్‌లు, సర్వీసులు, డిపో పరిస్థితులపై డీఎంను అడిగితెలుసుకున్నారు. దర్శి పొదిలి ట్రిప్పులు పెంచాలని డీఎం శంకరరావు కోరినట్లు ఆక్రమంలో దర్శి బస్టాండ్‌ను కూడా తనిఖీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా డిపోలో తాగునీరు ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.

నేడు డయల్ యువర్‌డీఎం

ఈనెల 17వ తేదీ గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపోమేనేజర్ శంకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పొదిలి డిపో పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, దర్శి, కురిచేడు, దొనకొండ మండలాల ప్రజలు, ప్రయాణికులు డిపో అభివృద్ధికి తమ విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య 9959225700కు ఫోన్ చేయాలని కోరారు.

క్రైం సమాచారం

పోలీస్ జీపు, మినీ లారీ ఢీ

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి). మండలంలోని చింతగుంట్ల గ్రామం వద్ద జాతీయ రహదారిపై పోలీస్ జీపు, మినీ లారీ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మార్కాపురం పట్టణం నుంచి రాచర్లకు పోలీసు జీపు వెళుతోంది. అదే సమయంలో నంద్యాల నుంచి మినీ లారీ కంభం మీదుగా నరసరావు పేటకు వెళుతూ చింతగుంట్ల వద్ద ఎదురెదురుగా వచ్చి ఢీ కొన్నాయి. దీంతో వాహనాలలో ప్రయాణిస్తున్న వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పెను ప్రమాదం నుంచి బయట పడ్డామని అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో పోలీస్ జీపు ముందుభాగం కొంత మేర దెబ్బతినింది. రూరల్ ఏ ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బెల్టుషాపులపై దాడులు

బేస్తవారపేట,ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట మండలంలో బుధవారం కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో బెల్టుషాపులపై దాడులు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల సమీపంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఓ మహిళను అదుపులోకి తీసుకున్నారు.మండలంలోని సింగరపల్లె గ్రామానికి చెందిన ఎస్.రామలక్షమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద ఉన్న 10 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బేస్తవారపేటలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న పి.బాలకోటారెడ్డి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

మిట్టపాలెంలో ఘర్షణ

● బెల్టుషాపు విషయమై రాళ్లు రువ్వుకున్న ఇరువర్గాలు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): త్రిపురాంతకం మండలం మిట్టపాలెం గ్రామంలో ఘర్షణ చోటుచేసుకుంది. ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. మద్యం బెల్టుషాపు విషయమై బుధవారం రాత్రి టీడీపీలోని రెండు వర్గాలు రాళ్లు రువ్వుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని బీసీ వర్గానికి చెందిన ఒక వ్యక్తి ఇటీవల జరిగిన వేలంలో రూ.2.80 లక్షలకు బెల్టుషాపును పాడుకొని నిర్వహిస్తున్నాడు. ఇదేగ్రామంలో టీడీపీలోని మరోవర్గానికి చెందిన వ్యక్తి ఎలాంటి పాట లేకుండా మద్యం బాటిళ్లు తీసుకొచ్చి ఎమ్మార్పీకి విక్రయిస్తున్నాడు. దీంతో మాజీ సర్పంచ్ పూట్ల వెంకటేశ్వర్లు అనుచరులు, అలాగే మరో నేత పూట్ల సీతయ్య అనుచరులు ఘర్షణకు దిగారు. మిద్దెలు ఎక్కి బుధవారం రాత్రి రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనలో సీతయ్య అనుచరులు ఎలమర్తి శ్రీనివాసరావు, పూట్ల మాధవి, చిన్న ఆంజనేయులు, హనుమంతరావులకు గాయాలైనట్లు తెలిపారు. పూట్ల వెంకటేశ్వర్లు అనుచరుల్లో శాఖమూరి వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం వైద్యశాలలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు రాత్రి 9.30కు మిట్టపాలెంకు చేరుకొని పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. వైద్యశాల నుంచి రిపోర్టు వస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని త్రిపురాంతకం ఎస్ఐ తెలిపారు.

రైతుల ఉసురు తీస్తున్న అకాల వర్షం

పంటలకు అపార నష్టం
దర్శి మండలంలో కోతకొచ్చిన సుమారు 200 ఎకరాల్లో వరి నేలమట్టం
తాళ్లూరు మండలంలో దెబ్బతిన్న మొక్కజొన్న
కన్నీరుమున్నీరవుతున్న కర్షకులు


దెబ్బతిన్న వరి

దర్శి మండలంలో...

దర్శి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు రైతులు ఉసురుతీస్తున్నాయి. ఆరుగాలం కష్టించి లక్ష లాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు చేతి కందే సమయంలో ప్రకృతి ఆగ్రహానికి గురై నీటి పాలవుతున్నాయి. మంగళవారం రాత్రి దర్శిలో 40 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఈ వర్షానికి కోతకొచ్చిన వరి పంట నేలమట్టమైంది. వరి వెన్నులు నీటి పాలయ్యాయి. రబీ సీజన్‌లో బొట్లపాలెం, చెరువుకొమ్ముపాలెం, తూర్పువీరాయపాలెం, పాపిరెడ్డి పాలెం తదితర గ్రామాల్లో సాగు చేసిన వరి ప్రస్తుతం కోతకు వచ్చింది. కొంతమంది కోతలు కోసి ఓదెలు వేశారు. మరికొంత పైరు కోతకు సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితుల్లో అకాలవర్షం భారీగా కురవటంతో కోతకొచ్చిన సుమారు 200 ఎకరాల్లో పంట దెబ్బతిందని రైతులు చెబుతున్నారు. తూర్పువెంకటాపురం, చందలూరు, బసిరెడ్డిపల్లి, తూర్పుచౌటపాలెం మారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో సాగుచేసిన మిర్చి, బొప్పాయి, మినుము పంటలు దెబ్బతిన్నాయి. మిర్చి పంట కోతకోసి ఆరబెట్టగా భారీ వర్షానికి తడిసి పోయింది. బొప్పాయి చెట్లు విరిగిపోవటమే కాక కాయలు కూడా రాలిపోయాయి. కోతదశలో ఉన్న మినుప పంట పూర్తిగా తడిసి పోయింది. అంతకుముందు రెండుసార్లు కురిసిన వర్షాలకు బొప్పాయి, మినుము వరి తదితర పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

దర్శిలో నేలకొరిగిన వరి


ముండ్లమూరులో... ముండ్లమూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీ కురిసిన వర్షానికి వివిధ రకాల పంటలుదెబ్బతిన్నాయి. మారెళ్ల, జమ్మలమడక, పూరిమెట్ల, భీమవరం, ఈదర, బొప్పూడివారిపాలెం, నాయుడుపాలెం, సుంకరవారిపాలెం, పోలవరం, శంకరాపురం, వేంపాడు, ముండ్లమూరు, పసుపుగల్లు, పులిపాడు, ఉల్లగల్లు, కెల్లంపల్లి, వేములలో సాగు చేసిన మొక్కజొన్న, మిరప, వైట్‌బర్లీ పొగాకుకు తీవ్ర నష్టం వాటిల్లింది. మొక్కజొన్న పైరు పూర్తిగా నేలకొరిగింది. ఆరబెట్టిన మిరప కల్లాల్లో తడిచి పోయింది. మొత్తం మీద అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం రైతులను కుంగ దీసింది.

తాళ్లూరు మండలంలో దెబ్బతిన్న మొక్కజొన్న

తాళ్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం వేకువజామును ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి మొక్కజొన్న పంట దెబ్బతింది. 45.8 మి.మీ వర్షం కురిసింది. దీని వల్ల వరి, పొగాకు, మిరప పంటలకు కొంత మేర నష్టం వాటిల్లగా మొక్కజొన్న పంట దాదాపు 200 ఎకరాల్లో దెబ్బతింది. పంట చేతికి వచ్చి కండెలను కోసేందుకు రైతాంగం సన్నద్ధమవుతుండగా వర్షం వల్ల నేల వాలింది. కోత యంత్రాలతో కండెలు కోసేందుకు వీలులేకుండా పోయి ఖర్చు పెరిగిందని రైతులు వాపోతున్నారు. నేలవాలిన మొక్కజొన్న దిగుబడి తీసేందుకు ఎకరాకు అదనంగా రూ.10వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందన్నారు. భూమి తడిగా ఉండటం, కండెపై నీరు పడినందున గింజ కొంత మేర తాలుగా వచ్చి రేటు కూడా తగ్గే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. వరి, మిరప, పొగాకు పంటలకు స్వల్పంగా నష్టం వస్తుందని చెబుతున్నారు.

రోడ్లపైకి, ఇళ్లలోకి చేరుకున్న మురుగునీరు

గ్రామాల్లో మురుగు కాలువల నుంచి నీరు కిందకి వెళ్లే మార్గం లేక రోడ్లపై గుండా ప్రవహిస్తూ బురదమయంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. తాళ్లూరులో రాముల వారి మేడ ముందుబాగంతో మురుగు నీరు నిలిచిపోయింది. వెనుక వైపున గల గృహాల్లోకి మురుగునీరు ప్రవహించి గృహయజమానులు ఇబ్బందులు పడ్డారు. సుంకిరెడ్డి పాలెంలో ఇళ్లముందే నీరు నిల్వవుండి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు.

అగ్ని ప్రమాదాలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

అగ్నిమాపక శాఖ అధికారి బంగారుబాబు

కనిగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపకశాఖ సీహెచ్‌వో బంగారుబాబు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎంజేఆర్, వెన్నల అపార్ట్‌మెంట్‌లలో నివాసితులకు బుధవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేసే కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాలను చేసి అవగాహన కల్పించారు.

టీడీపీలో చేరిన ఎర్ర ఓబనపల్లి వైసీపీ నాయకులు

దర్శి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రఓబనపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కైపు బ్రహ్మారెడ్డి తన అనుచరులతో బుధవారం రాత్రి టీడీపీలో చేరారు. టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు వారికి పార్టీ కండువాలను కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజారంజక పాలనకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీకి చేరడం ఆనందదాయకమన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నందున అన్నివర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పార్టీలో చేరిన బ్రహ్మారెడ్డి, పేరం చిననాగిరెడ్డి, ఎడమకంటి చినవెంకటేశ్వరరెడ్డి, ఓబులురెడ్డి, నాని, షేక్ విజన్, బ్రహ్మయ్యను వారు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బారావు, మారం వెంకటేశ్వరరెడ్డి, ఆదిరెడ్డి పాల్గొన్నారు.


డాక్టర్ లక్ష్మి, లలిత్‌సాగర్ సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నేతలు

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

వెలిగండ్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వెలిగండ్ల మండలంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ మహబూబ్‌బాషా బుధవారం తెలిపారు. 21 నుంచి 60 ఏళ్లలోపు ఉండి తెల్లరేషన్ కార్డు కలిగిన వారు అర్హులన్నారు. ఈ నెల 14 నుంచి మే 10వ తేదీ వరకు అభ్యర్థులు ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఆధార్, తెల్లరేషన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

వెంగళాయపల్లి సర్పంచ్‌కి మాతృవియోగం


గంగమ్మ(ఫైల్)

పీసీపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల టీడీపీ నాయకులు వెంగళాయపల్లి, సర్పంచ్ కరణం తిరుపతయ్య తల్లి గంగమ్మ(80) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. మంగళవారం రాత్రి అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబసభ్యులు చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. విషయం తెలుసుకున్న పార్టీ శ్రేణులు గంగమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. గురువారం ఉదయం ఆమెకు అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబసభ్యులు తెలిపారు.

బాల్యవివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా
ప్రభుత్వ గృహ నిర్మాణ కాలనీని సందర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే

కనిగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా కనిగిరి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగే సామూహిక సీమంతాల కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, ఏపీ టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులకు సీమంతం చేసి పూలు, పండ్లు, సారె అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రలోనే ప్రకాశం జిల్లాలో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు ఆధారాలుఉన్నాయన్నారు. చిన్న వయస్సులోనే వివాహాలు మంచిదికాదని చెప్పారు. ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు 15రోజులు పాటు పౌష్టికాహార పక్షోత్సవాలు (పోషణ్ పక్వాడ) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రకాశం, మున్సిపల్ చైర్మన్ గఫార్, డీఎస్‌డీవో, ఎంపీడీవో హనుమంతరావు, సీడీపీవో సరోజిని, సూపర్‌వైజర్ పార్వతమ్మ పాల్గొన్నారు.

ఎస్సీ, బీసీ, ఎస్టీలకు గృహ నిర్మాణ వ్యయం పెంపు : జిల్లా కలెక్టర్

ఎస్సీ, బీసీ, ఎస్టీ వర్గాల వారికి అందించే గృహ నిర్మాణ వ్యయాన్ని ప్రభుత్వం పెంచిందని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. పట్టణ పరిధిలోని అర్బన్ హౌసింగ్ కాలనీని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డితో కలసి సందర్శించారు. గృహ నిర్మాణాల పురోగతి వివరాలను హౌసింగ్ శాఖ అధికారులు నుంచి అడిగి తెలుసుకున్నారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో 1390 ప్లాట్లను వేయగా, 544 మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్దిదారులకు యూనిట్ విలువ రూ.1.80లక్షలకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ75వేలు, పీవీటీజీ (ఆదివాసి గిరిజనులకు) రూ.1లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, హౌసింగ్ పీడీ శీనివాసప్రసాద్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ రవిశంకర్ పాల్గొన్నారు.


గర్భిణులకు సీమంతం చేస్తున్న కలెక్టర్ అన్సారియా

అమరజీవి పోరాట ఫలితమే ఆంధ్రరాష్ట్రం

పడమటిపల్లిలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పించిన డాక్టర్ ఉగ్ర, దూండి రాకేష్

పీసీపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాట ఫలితంగానే ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలలో భాగంగా ఆయన జన్మస్థలమైన పడమటిపల్లిలోని శ్రీరాములు నివాసస్థలాన్ని బుధవారం వారు సందర్శించారు. తొలుత గ్రామంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ పరభాషా పాలనలో ఉన్న తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలంటూ 58రోజులపాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి అమరులయ్యారని గుర్తుచేశారు. ఆయన దీక్షా పోరాట ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం అశువులుబాసిన అమరజీవి పడమటిపల్లిలో జన్మించి మన ప్రాంతం వారు కావడం అందరి అదృష్టం అని చెప్పారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ మాట్లాడుతూ రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం తరతరాలు గుర్తుండిపోయేలా రాష్ట్ర వ్యాప్తంగా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా అమరావతిలో 58అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠించనుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్య వైశ్య సంఘం నాయకులు కాకొల్లు కొండలరావు, యేల్చూరి బ్రహ్మయ్య, శ్రీను, వెంకటరామయ్య, దొడ్డ వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు విగ్రహానికి పులమాల వేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర, రాకేష్

శివరాంపురంలో శ్మశాన స్థలం ఆక్రమణ

ప్రహరీ కూల్చి మట్టి రోడ్డు నిర్మాణం చేసిన ఉపసర్పంచ్

తాళ్లూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్మశానవాటికను అభివృద్ధి చేస్తే దాని ప్రహరీ కూల్చి శ్మశాన స్థలాన్ని గ్రామఉపసర్పంచ్ ఎన్.రామ్మూర్తి ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... శివరాంపురం నుంచి ఉమ్మనేనివారిపాలెం వెళ్లే మార్గంలో సర్వేనంబర్ 70/16లో 1.08 సెంట్లలో హిందూ శ్మశానం ఉంది. ఆ శ్మశాన స్థలంలో గ్రామంలోని 14 కులాలకు చెందిన వారి దహనసంస్కారాలు అనాది నుంచి నిర్వహిస్తుంటారు. ఇదిలా ఉండగా శ్మశానవాటిక ప్రహరీని కూల్చి 20 సెంట్ల స్థలాన్ని గ్రామ ఉపసర్పంచ్ రామూర్తి ఆక్రమించాడని, ఆక్రమణ చెర నుంచి శ్మశాన స్థలాన్ని కాపాడాలని అనేకమార్లు జిల్లా అధికారులకు గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎగువన ఉన్న తన స్థలంలోకి వెళ్లేందుకు బాట లేకపోవడంతో ఉపసర్పంచ్ రామూర్తి ఏకంగా శ్మశానాన్ని ఆక్రమించి రాకపోకలకు అనువుగా ఉండేందుకు చదును చేశాడు. అంతేగాక మట్టి రోడ్డు కూడా నిర్మించారు. ఉపసర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఆలోకం సూర్యనారాయణ, నిశ్శంకం హనుమంతరావులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈవిషయమై గ్రామసర్పంచ్ బొడ్డు రాములు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజారమేష్‌లను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా శ్మశాన వాటిక ప్రహరీ కూల్చి రోడ్డు వేసినట్లు తెలిసిందని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


శ్మశానవాటిక ప్రహరీ కూల్చి నిర్మాణం చేసిన మట్టి రోడ్డు

అవీఇవీ

డాబా మెట్లు దిగుతూ జారిపడి యువకుడు మృతి

తాళ్లూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెంలో ఓ యువకుడు రాత్రి సమయంలో డాబా దిగుతూ జారిపడి మృతి చెందిన ఘటనపై బుధవారం కేసు నమోదైంది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఏఎస్సై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... కొత్తపాలేనికి చెందిన చెరుకుపల్లి నరసింహారావు(35) రాత్రి ఇంటిడాబాపై నిద్రిస్తుండగా 12గంటల సమయంలో మంచినీటి కోసం కిందకు దిగుతూ నిద్రమత్తులో డాబా అంచున కాలు వేసి జారిపడ్డారు. పిట్ట గోడలేకపోవటం వల్ల జారి నేలపైపడటంతో కాళ్లువిరిగి పోగా, తలభాగం తీవ్రంగా దెబ్బతింది. తీవ్ర గాయాలైన నరసింహారావును ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఉదయం మృతి చెందాడు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ మోహన్‌రావు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

దొనకొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన దొనకొండలోని కేజీబీవీ పాఠశాల మలుపు వద్ద బుధవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు... కొనకనమిట్ల మండలం, రేగడిపల్లికి చెందిన బీ గురుస్వామి సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై దొనకొండ మండలంలోని చందవరం గ్రామం వచ్చాడు. పనులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో కేజీబీవీ పాఠశాల వద్ద గల మలుపు వద్ద వాహనం అదుపుతప్పి వేగంగా కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో గురుస్వామి తీవ్రగాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రునికి ప్రథమ చికిత్స చేస్తూ దర్శి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు.

భార్యను హత్య చేసిన కేసులో భర్త అరెస్ట్


నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

పామూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అనుమానం పెనుభూతంగా మారటంతో ఇంటి వాకిట్లో నిద్రిస్తున్న భార్యను భర్త రోకలి బండతో తలపై మోదటంతో అక్కడికక్కడే మృతి చెందిన కేసులో నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసినట్లు సీఐ భీమానాయక్ చెప్పారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పామూరులోని ప్రశాంతి నగర్‌లో నివాసం ఉంటున్న యాసారపు మార్తమ్మ(33)ను భర్త రమేష్ అనుమానంతో ఈ నెల 13న మధ్యాహ్న సమయంలో ఇంటిలో నిద్రిస్తుండగా రోకలి బండతో తలపై కొట్టగా మృతి చెందింది. ఆ తర్వాత నిందితుడు పరారయ్యాడు. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. మృతురాలి అన్న గంధం ప్రకాశం ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ పర్యవేక్షణలో త్వరితగతిన కేసును దర్యాప్తు చేసి నిందితుడిని బుధవారం కొత్తపల్లి వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

పామూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చోరీల నియంత్రణలో భాగంగా ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నట్లు సీఐ ఎం భీమానాయక్ చెప్పారు. బుధవారం పట్టణంలో పలు వాహనాలను తనిఖీచేశారు. జిల్లాలో వరుసగా జరుగుతున్న దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు ఎవరైనా మీ ప్రాంతాల్లో సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

ఆక్రమిత భూములలో దేవదాయశాఖ బోర్డు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


ఆక్రమిత దేవదాయ భూమిలో బోర్డును ఏర్పాటు చేస్తున్న ఈవో

పీసీపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదయిర్లపాడులో గల మల్లేశ్వర స్వామి దేవాలయానికి చెందిన సర్వేనెంబరు 133లోని కొంత భూమిని అక్రమార్కులు ఆక్రమించి ప్లాట్లు వేసిన విషయం విదితమే. దీనిపై బుధవారం ఆంధ్రజ్యోతిలో మల్లేశ్వరస్వామి భూములు అన్యాక్రాంతం అనే కథనం ప్రచురిచితమైంది. ఈ కథనానికి దేవదాయశాఖ అధికారులు స్పందించారు. ఈవో కొండారెడ్డి ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారుల ద్వారా ఆక్రమిత భూమిని సర్వే చేయించారు. ఆ భూములలో అక్రమంగా ప్లాట్లుకోసం పాతిన రాళ్లను తొలగించారు. అనంతరం సర్వేనెంబరు 133 మల్లేశ్వరస్వామి దేవాలయానికి చెందిన భూమి అని బోర్డు ఏర్పాటు చేశారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

దొనకొండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : దొనకొండ గ్రామ పంచాయతీ పరిధిలో నిధులు దుర్వినియోగం జరిగిందనే అభియోగంపై కనిగిరి డివిజన్ డీఎల్‌పీవో హనుమంతరావు బుధవారం విచారణ చేపట్టారు. గత నాలుగేళ్లుగా ఎటువంటి పనులు చేపట్టకుండా నిధులు దుర్వినియోగం చేశారని దొనకొండకు చెందిన రసూల్‌బాష ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు డీఎల్‌పీవో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గ్రేస్‌రత్నకుమారి, కార్యదర్శి పి కృష్ణమూర్తి, ఫిర్యాదుదారుడు రసూల్‌బాషల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈవోఆర్డీ ఆదాంషఫీ పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

సీఎస్‌పురం/పామూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కురుస్తున్న అకాల వర్షాలకు వరి పంట నేలకొరిగితే వెంటనే సస్యరక్షణ చర్యలు తీసుకొని కాపాడుకోవాలని ఏవో సంపత్‌కుమార్ చెప్పారు. మండలంలోని చెన్నపునాయినిపల్లి, రేగులచెలక, డీజీపేట గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి, నువ్వు పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయవిస్తరణాధికారి పి శ్రీనివాసులు, వ్యవసాయ సహాయకులు ఎం వెంకటేశ్వర్లు, వి చిరంజీవి, అనూషా పాల్గొన్నారు.

ఆర్యవైశ్య జిల్లా ఉపాధ్యక్షుడిగా హరీష్ నియామకం

పామూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా ఆర్య వైశ్యసంఘం ఉపాధ్యక్షుడిగా పామూరుకు చెందిన పందిటి హరీష్‌ను జిల్లా అధ్యక్షుడు కోట హనుమంతరావు నియమించారు. బుధవారం కనిగిరిలో జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లపోతు వెంకటేశ్వర్లు, నాయకులు ఆకుతోట శ్రీనివాసులు, మువ్వల శ్రీనివాసులు, చక్కా వెంకటకేశవరావు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

ముండ్లమూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బస్టాండ్ సెంటర్లో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహా ఆర్య వైశ్యసంఘ నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్య వైశ్యసంఘం అధ్యక్షులు అమరా రామారావు, అమరా భానుప్రసాదరావు, గార్లపాటి సత్యనారాయణ, మెట్టింటి పుల్లారావు, గార్లపాటి కృష్ణ, పొట్టి శ్రీరాములు మేనల్లుళ్లు గుడిపూడి సత్యనారాయణ, సురేష్, హనుమంతరావు, వలేటి రమేష్, నెట్టింటి శ్రీనివాసరావు, అమ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలు ఆరుబయట నిద్రించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కమలాకర్ చెప్పారు. బుధవారం రాత్రి మండలంలోని పూరిమిట్ల గ్రామంలో పల్లెనిద్ర చేశారు. ఏఎస్‌ఐ హనుమంతురావు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎస్సైను బసవాపురం, శ్రీనివాసనగర్, ఈదర గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కట్టా చిన వెంకటంబొట్లు, టి.ఇంద్రసేనారెడ్డి, బండారు చినశ్రీను, సూరిబాబు, చొప్పరపు నాగేశ్వరరావు సత్కరించారు.

ఆరోతరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష

కనిగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మోడల్‌స్కూల్‌లో జరుగుతున్న ఆరోతరగతి ప్రవేశ పరీక్షలు బుధవారం స్థానిక మోడల్ స్కూల్‌లో జరిగాయి. ఈ పరీక్షలకు 132 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా, 88 మంది పరీక్షలు రాసినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ తులసిపద్మావతి తెలిపారు.




రేపల్లె : ఓలేరుపల్లెపాలెం వద్ద ఇసుకబస్తాలతో పటిష్టపరిచిన కరకట్ట(ఫైల్)

వేతన వెతలు



- నీరుగారుతున్న ఉపాధి హామీ పథకం లక్ష్యం
- కూలీల వేతనాలు రూ.51.37 కోట్లు
- మెటీరియల్ బకాయిలు రూ.154.46 కోట్లు
- మూడు నెలలుగా నిలిచిపోయిన చెల్లింపులు
- ఆర్థిక ఇక్కట్లతో కష్టజీవుల ఎదురు చూపు
- బిల్లులు మంజూరు కాక నిలిచిన పనులు
- చోద్యం చూస్తున్న పాలకులు

ఉపాధి వేతనం చెల్లింపులు సకాలంలో జరగడంలేదు. నెలల తరబడి వేతనాలు నిలిచిపోతున్నాయి. చేసిన పనికి సొమ్ములు అందక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. 90 రోజులుగా వేతన చెల్లింపులు నిలిచిపోయాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రూ.51.37 కోట్లు వేతన బకాయిలు పేరుకుపోయాయి. వేతనం ఇప్పించాలన్న కూలీల మొర ఆలకించే నాథుడే కరువయ్యారు. పరిస్థితి తీవ్రంగా ఉన్నా పాలకులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి కూలీలు చేసిన పనికి వేతనం కోసం పాస్ పుస్తకాలు చేతపట్టుకొని బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతు న్నారు. ఖాతాలు ఖాళీగా కనిపించడంతో నిరాశకు లోన వుతున్నారు. ఉపాధి కార్యాలయాలకు వెళితే.. వేతనం రేపో మాపో బ్యాంకు ఖాతాకు జమ అవుతుందని అధికారులు చెప్పి పంపించేస్తున్నారు. జనవరి 15 నుంచి ఇప్పటి వరకు పనులు చేసిన కూలీలకు ఉపాధి సొమ్ము చెల్లించలేకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. పనులకు సంబంధించిన సామగ్రి బిల్లుల బకా యిలు రూ.154.46 కోట్లు పేరుకుపోయాయి. ప్రతివారం క్షేత్రస్థాయి సిబ్బంది కార్మికుల వారీగా వేతనం వివరాలను మండల కార్యాలయానికి పంపిస్తారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రెండు రోజులకు కూలీల ఖాతాల్లో నగదు జమ చేయాలి. కానీ, మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించట్లేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు.

నీరుగారుతున్న ఉపాధి లక్ష్యం

వలసల నివారణకు, వ్యవసాయ, కార్మిక కూలీలకు పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం అమలులో నీరుగారిపోతోంది. చేసిన పనికి రెండు రోజుల్లో ప్రతి కూలీకి సొమ్ము వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయాలి. అయితే వేతనాలు చెల్లింపుల్లో నిర్లక్ష్యం తాండవిస్తోందని కూలీలు వాపోతున్నారు. వెనువెంటనే కూలి రాకపోవడంతో ఉపాధి పనుల పట్ల కూలీలు ఆసక్తి కనబరచడంలేదు. పల్నాడు జిల్లాలో రూ.19.86 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.8.69 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ 22.82 కోట్లు వేతన బకాయిలు ఉన్నాయి.

విముఖత చూపుతున్న కూలీలు

ప్రభుత్వం ఉపాధి కూలీకి కనీస రోజు వేతనం రూ.307గా నిర్ణయించింది. ఈ మేరకు వేతనం కూలీలకు లభించడంలేదు. వ్యక్తిగత పని దినాలు కల్పించడంలో యంత్రాంగం అలసత్వం వహిస్తుందన్న ఆరోపణలు న్నాయి. పల్నాడు జిల్లాలో అత్యధికంగా 5.77 లక్షల జాబ్ కార్డులు నమోదు చేశారు. గుంటూరు జిల్లాలో 2.09 లక్షలు, బాపట్ల జిల్లాలో 4.72 లక్షల జాబ్ కార్డులున్నాయి. నమోదు చేసుకున్నవారందరూ పనులకు హాజరు కావడంలేదు. పల్నాడులో 4.53 లక్షలు, బాపట్ల లో 3.74 లక్షలు, గుంటూరులో 1.51 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. వీరు మాత్రమే ఉపాధి పనులకు హాజరవుతున్నారు. పేరు నమోదు చేసుకుని, పనులకు హాజరు కాని కూలీల సంఖ్యలో లక్షల్లో ఉండటం గమనార్హం. వెనువెంటనే వేతనం చెల్లించి ఆదుకోవాలని ఉపాధి కూలీలు అధికారులను కోరుతున్నారు.

వేసవి భత్యాలు రద్దు

గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి ఫిబ్రవరిలో 20శాతం, మార్చిలో 25, ఏప్రిల్‌లో 30 శాతం అదనపు వేతనం ఇచ్చేవారు. మూడేళ్లగా దీనిని తొలగించారు. వీటితో పాటు పార, గడ్డపార, తాగునీరు, మజ్జిగకు సంబంధించి అదనపు భత్యం ఉండేది. గతంలో మాదిరిగా పని ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు, గాయాలైతే ప్రాథమిక చికిత్స బాక్స్‌లు ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు. వేసవి భత్యం, సౌకర్యాలు సమకూర్చ డంతో పాటు సకాలంలో వేతనం చెల్లిస్తే పనుల్లోకి వచ్చే వేతనదారుల సంఖ్య పెరుగుతుందంటున్నారు.

బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రహదారులు, మురుగు కాల్వలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణం పనులు చేపట్టారు. వీటితో పాటు గోకులం షెడ్లు తదితర పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు స్తంభించి పోయాయి. పూర్తయిన పనులకు నెలలు తరబడి బిల్లులు ఆగిపోయాయి. పల్లె పండుగ పథకం ప్రారంభంలో మొదటి రెండు వారాలు బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరిగాయి. అనంతరం చెల్లింపులు నిలిపోవడంతో పనులూ ఆగిపోయాయి. పల్నాడు జిల్లాలో 80.49 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.58.18 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.15.79 కోట్లు బిల్లులు చెల్లించాలి. కమిటీల పర్యవేక్షణలో చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపులు జాప్యం జరుగుతుండటంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దిగువన దిగులు

- బలహీనంగా కృష్ణానది కరకట్టలు
- ప్రకాశం బ్యారేజీకి దిగువన మరింత ప్రమాదకరం
- ఎగువన పటిష్టతకు రూ. 1100 కోట్ల నిధులు
- వరదలొస్తే దిగువ కరకట్టకు ఎక్కడ గండ్లు పడేనో?
- భయం గుప్పిట్లో కృష్ణా తీర గ్రామాలు
- గతేడాది వరదలకు వణికిపోయిన గ్రామాలు
- రూ. 2 వేల కోట్లతో ప్రతిపాదనలు పంపిన ఆర్‌సీ
- నదీ తీరం వెంబడి ఉన్న నలుగురు మంత్రులపైనే ఆశ


కొల్లూరు-ఈపూరు మధ్య సింగిల్ రోడ్డుగా ఉన్న కరకట్ట కోతపడి ప్రమాదకరంగా మారిన చిత్రం

తెనాలి, రేపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి వరదొచ్చిందంటే తీరంలో ప్రకాశం బ్యారేజీకి దిగువన ఉన్న గ్రామాలు వణికి పోతుంటాయి. బ్యారేజీ దిగువన కర కట్ట సీతానగరం నుంచి నది సముద్రంలో కలిసే ప్రదేశం లంకెవానిదిబ్బ వరకు 86 కి.మీటర్లు విస్తరించి ఉంది. కృష్ణా నదికి వరదలు వచ్చినప్పుడు ఈ కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు ప్రాణాలు గుప్పిట పట్టి బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కృష్ణా ఎగువ భాగాన కుడి కరక ట్టను విస్తరించి, నాలుగు లేన్ల రహదారిని నిర్మించేందుకు నిధులు కూడా మంజూరు చేసింది. ప్రకాశం బ్యారేజీ ఎగువున వైకుంఠపురం వరకు ఉన్న కరకట్టలో 7 కి.మీ టర్ల దూరాన్ని పటిష్టపరచడంతోపాటు, నదిలో గోడ నిర్మాణం కూడా చేసేలా రూ.1,100 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది.

రూ.2వేల కోట్లతో ఆర్‌సీ ప్రతిపాదనలు

ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణానది కరక ట్ట పటిష్టతకు ఇంకా మోక్షం లభించలేదు. దిగువ కరకట్టనూ బలపరిచేందుకు ప్రభుత్వానికి నదీ పరివాహక ప్రాంత పరిరక్షణ విభాగం రివర్ కన్జర్వేట రీ(ఆర్.సి) రూ.2వేల కోట్లతో ప్రతిపాదనలను ప్రభు త్వానికి తాజాగా పం పింది. ఎగువ కర కట్ట రాజధా ని ప్రాంతానికి ఎంత అవసరమో, దిగువన కరకట్టను పటిష్టపర చడం కూడా అంతే అవసరం ఉంది.

కరకట్ట బలహీనం..గండ్లకు అవకాశం

కృష్ణా నదికి వరదలొచ్చినప్పుడు పొరపాటున కరకట్టకు ఎక్కడైనా గండి పడితే ఏంటి పరిస్థితి!..ఈ మాట తలచుకుంటేనే తీర గ్రామాల ప్రజల వెన్నులో వణుకు పుడుతుంది. దీనికి గత ఓలేరు గండి ఉదంతమే నిదర్శనం. వల్లభాపురం వంటి గ్రామాల దగ్గర్లో గండ్లు పడితే దిగువ గ్రామాల్లో జలప్రళయ తప్పదు. 86 కి.మీటర్ల పొడవునా కరకట్ట పటిష్టంగా లేకపోవడంతో గండ్లు పడ డానికి అనేకచోట్ల సిద్ధంగా ఉంది. గతంలో మొత్తం కుడి కరక ట్టను పటిష్టపరిచి, రోడ్డు నిర్మాణం చేపట్టేలా అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ. 119 కోట్లు దీనికోసం కేటాయిస్తే, సీతా నగరం నుంచి పెనుమూడి వరకు రూ. 111 కోట్లతో కరకట్టను మట్టితో బలపరచడం, ఉన్న ఎత్తుకంటే మరింత ఎత్తు పెంచడం, కరకట్ట పైభాగం 4 నుంచి 7 అడుగుల వెడల్పు ఉంటే దానిని 12 అడుగులకు పెంచడం వంటి పనులు చేపట్టారు. దీనిపై డ బుల్ రోడ్డు కూడా నిర్మాణం చేశారు. అయితే తాడేపల్లి, విజ యవాడ క్లబ్ దగ్గర కొంత భాగం, పెదకొండూరు - వల్లభా పురం మధ్య, ఈపూరు-కొల్లూరు, దోనేపూడి-పెదపులివర్రు ప్రాంతాల్లో అసలు కరకట్ట పటిష్టపరచలేదు. కొన్నిచోట్ల భూములు ఇవ్వడానికి రైతులు సమ్మతించకపోవడం, మరికొందరు కోర్టును ఆశ్రయించడంతో ఈ ప్రాంతాల్లో కరకట్ట ఆధునికీకరణ జరగలేదు. దీంతో ఇక్కడ కరకట్ట చిక్కి శల్యమైపోయి ఉంటే, చాలాచోట్ల వర్షాలకు కరకట్ట అంచులు కోతపడిపోయి ఉన్నాయి. ఆధునికీకరణ పనులు జరిగిన చోట్ల కూడా కరకట్ట కుంగిపోయి, గతేడాది వచ్చిన వరదలకు అంచుల వరకు నీరు ప్రవహించి, జనానికి దడ పుట్టించింది.


ఓలేరుపల్లెపాలెంవద్ద కృష్ణానది కరకట్టకు గండిపడిన ప్రాంతం (ఫైల్)

వెంటాడుతున్న గత పీడకలలు

- కృష్ణా నదికి 2009లో వచ్చిన వరదలకు భట్టి ప్రోలు మండలం ఓలేరు దగ్గర కరకట్టకు గండిపడింది. పలు గ్రామాలతోపాటు, రేపల్లె పటణం కూడా వరద నీటిలో చిక్కు కుపోయింది. పట్టణంలోనే పడవలపై ప్రయాణం చెయ్యాల్సి వచ్చింది. గ్రామాల్లో వరద ముంపు వీడడానికి నెలపైనే పట్టింది.
- గతేడాది కృష్ణా నదికి రికార్డు స్థాయిలో 11.36 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించింది. దుగ్గిరాల మండలం పెదకొ డూరు నుంచి రేపల్లె మండలం లంకెవాని దిబ్బ వరకు జనం రాత్రులు నిద్రలేకుండా కరకట్టపైనే కాపలకాశారు.
- ఈ వరదలకు వెల్లటూరు-పెనుమూడి మధ్య పలుచోట్ల గండ్లు పడేపరిస్థితి రావ డంతో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, అధికారులు రాత్రిళ్ల పొక్లెయినర్ల సాయంతో యుద్ధ ప్రాతిపది కన కరకట్టను పటిష్టం చేశారు. దీంతో గండ్లు పడకుండా పెను ప్రమాదాన్ని ఆపగలిగారు.

'త్రి'కరణ శుద్ధిగా మంత్రులు దృష్టి సారించాలి

ఎగువ కరకట్ట అత్యవసర పనులను ప్రభుత్వం ఆమోదిం చి, టెండర్లు పిలవడానికి సిద్ధమైంది. కర కట్ట దిగువనున్న నియోజకవర్గాల్లో కేంద్రమంత్రితో పాటు, ముగ్గురు రాష్ట్ర మంత్రులు ఉన్నారు. వీరు తల చుకుంటే నిధుల మంజూరు పెద్ద సమస్యే కాదు. కృష్ణా నది కరకట్ట తాడేపల్లి నుంచి పెదకోడూరు వరకు మంగళ గిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్, అక్కడి నుంచి కొల్లిపర మండలం వరకు మంత్రి నాదెండ్ల మనోహర్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఆ దిగువున మొత్తం రేపల్లె ఎమ్మెల్యే, మంత్రి అనగాని సత్యప్రసాద్ పరిధిలో ఉంది. వీరంతా కీలక మంత్రులే కావడంతో దిగువ కరకట్టకు కూడా ఈ ఏడాదిలో మోక్షం లభిస్తుందన్న ఆశాభావాన్ని నీటిపారుదల శాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు నదిలోనూ గ్రాయిన్స్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీనికోసం కూడా మంత్రులు శ్రద్ధ చూపితే నదీ పరి వాహక ప్రాంతం సురక్షితంగా ఉంటుంది.

వేట విరామ భృతి.. రెండు రెట్లు

రూ.20 వేలకు పెంపుదలపై మత్స్యకారుల హర్షం

వైసీపీ హయాంలో గత సంవత్సరం విరామభృతి ఎగవేత

రేపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేట విరామ భృతి రెండు రెట్లైంది. గత ప్రభుత్వం రూ.10 వేలు ఇవ్వగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం దానిని రూ.20 వేలకు పెంచింది. దీంతో మత్స్యకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం నుంచి సముద్రంలో చేపల వేట విరామం ప్రకటించారు. జూన్ 14 వరకు సముద్రంలో చేపల వేటపై నిషేధం అమల్లో ఉంటుంది. ఈ సమ యంలో మత్స్యకారుల జీవనోపాధి నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేకంగా భృతి చెల్లిస్తుంటోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఏటా రూ.10 వేలు చెల్లించింది. 2023-24కు సంబంధించిన మత్స్యకారుల భృతి రూ.10 వేలు కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టింది. ఈ క్రమంలో గత ఎన్నికల ప్ర చారంలో కూటమి నేతలు మత్స్యకారులకు భృతిని పెం చుతామంటూ హామీ ఇచ్చారు. ఈ హామీ అమలులో భాగంగా రెండురోజుల క్రితం జరిగిన క్యాబినెట్ సమా వేశంలో భృతిని రూ.20 వేలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మొత్తాన్ని ఈ నెల 26న మత్స్యకా రులకు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్ర మంలో ఇప్పటికే జిల్లాలోని నిజాంపట్నంహార్బర్, బాప ట్ల, సూర్యలంక, చీరాల, ప్రాంతాల్లో అర్హులైన మత్స్యకా రులజాబితాను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

గత ప్రభుత్వంలో అవినీతి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరకొరగానే మత్స్యకారులకు భృతి అందింది. మత్స్యకార భృతి జాబితాల్లో అధికారులు ఇష్టానుసారంగా పేర్లు నమో దు చేశారు. మత్స్యకారుల పేరిట రూ.లక్షలు దోచుకు న్నారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో అర్హులైన భృతి అందలేదని ఉన్నతాధికారులకు పలువురు మత్స్య కారులు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టి అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించి బాధ్యులను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

హార్బర్‌లో నిలిచిన బోట్లు..

వేట విరామంతో హార్బర్‌లో 1000 బోట్లు, ఫైబర్ బోట్లు, ఇంజన్ నావలు, సంప్రదాయ పడవలు జెట్టీ లు తీరానికి పరిమితమయ్యాయి. కొత్తపాలెం, నక్షత్ర న గర్, రేపల్లె మండలం లంకేవానిదిబ్బ, పెనుమూడి, మోళ్లగుంట, లక్ష్మీపురం గ్రామాల్లో 10 వేల మంది వేట చేసుకుని జీవనాన్ని గడుపుతున్నారు. బాపట్ల, చీరాల ప్రాంతంలో సముద్ర వెంబడి మత్స్యకారులు జీవనం చేసుకునే వారు 16వేలకు పైగానేఉన్నారు. ఒక్కో బోటుకు 8 నుంచి 10 మంది వరకు కళాసీలు పనిచేస్తుంటారు. అన్ని బోట్లలో సుమారు 10వేల మంది వేట చేస్తూ జీవనం సాగిస్తు న్నారు. 40 రోజులుగా వేట నిషేధంతో ఆయా కుటుంబాల జీవనం కనాకష్టంగా ఉంటుంది. ఈ క్రమంలో జీవనభృతికి సంబంధించి ప్రభుత్వం నుంచి శుభవార్త అందడంతో మత్స్యకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.


హార్బర్ జెట్టీ వద్ద నిలిచిన బోట్లు


నిజాంపట్నం హార్బర్‌లో వలలను బాగు చేసుకుంటున్న మత్స్యకారులు

తీరంలో లోతు సూచించేలా జెండాలు

సూర్యలంకలో భద్రతా ఏర్పాట్ల పరిశీలనలో ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు నివా రించడంలో భాగంగా సూర్యలంక స ముద్రతీరంలో నిర్దిష్ట లోతును సూచించే లా జెండాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎ స్పీ తుషార్‌డూడీ తెలిపారు. తీరం వద్ద భద్రతా ఏర్పాట్లను బుధవారం ఎస్పీ ఆక స్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదే శాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. మద్యం మత్తులో స ముద్రంలో మునగరాదన్నారు. మహిళల పట్ల ఆసభ్యకరంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. పోలీసుశాఖ హెచ్చరికలు, సూచనలు యాత్రికులు పాటించాలన్నారు. తీరంలో నిఘా కోసం డ్రోన్ కెమేరాలను వినియోగిస్తున్నామన్నారు. సముద్ర లోతు లకు వెళుతున్న యాత్రికులను అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ ఉండాలన్నారు.ఎస్పీ వెంట డీఎస్పీ రామాం జనేయులు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, రూరల్ సీఐ శ్రీనివాసరావు ఉన్నారు.

తాగునీటి సమస్యపై ముందస్తు చర్యలు

- కాల్వలకు నీరు విడుదల చేసి చెరువులను నింపాలి
- అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా శాఖల అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. కేడబ్ల్యూడీ కింద 75 ట్యాంక్‌ల్లో నీటి నిల్వలపై కలెక్టర్ ఆరా తీశారు. ఎస్ఎస్ ట్యాంకులకు సంబంధించి బాపట్ల 33శాతం, రేపల్లె 44శాతం, చీరాల 73శాతం నీటి నిల్వలు ఉన్నాయని కృష్ణాపశ్చిమడెల్టా ఎస్ఈ వెంకటరత్నం కలెక్టర్‌కు తెలిపారు. ఎన్ఎస్పీ పరిధిలోని 40 ట్యాంక్‌ల్లో 45 రోజులకు సరిపడ నీటి నిల్వలు ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు తెలిపారు. బాపట్లలోని సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌లో నీరు వారంరోజుల అవసరాలుకు సరిపోతాయని రేపల్లె సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌లో నీరు నెలరోజులపాటు, చీరాల స మ్మర్‌స్టోరేజి ట్యాంక్‌లో నీరు 120 రోజులపాటు అవసరాలకు సరిపోతాయని ము న్సిపల్ కమిషనర్లు కలెక్టర్‌కు తెలిపారు. కృష్ణాపశ్చిమడెల్టా నుంచి బాపట్ల ఎస్ఎస్ ట్యాంక్‌కు నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నీరు బాపట్లకు చేరిన తర్వాత ఎప్పటికప్పుడు ట్యాంక్‌లను నింపాల న్నారు. ఎన్ఎస్పీ కెనల్ నుంచి నీరు విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు. కాల్వల ద్వారా నీటిని విడుదల చేసిన తర్వాత ఆ నీటిని కేవలం తాగునీటి అ వసరాలకు మాత్రమే వాడాలని సూచించారు. మార్గమధ్యలో నీటిని పొలాలకు వా డకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇందు కోసం ముగ్గురు సభ్యులతో కూడిన టీ మ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైన పంట పొలాలకు నీరు వాడినట్లు తె లిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కృష్ణాపశ్చిమడెల్టా నుంచి 3,300 క్యూసెక్కులకు 1000 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నందున అవసరమై న చోట మోటర్ల ద్వారా నీటిని తరలించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించా రు. సమావేశంలో ఏఎస్పీ విఠలేశ్వర్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్డీవో గ్లోరియా, కమి షనర్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంచిన అకాల వర్షాలు

- అద్దంకిలో బొప్పాయి, అరటి రైతులకు నష్టాలు
- చినగంజాంలో భారీ వర్షం.. నీటి పాలైన ఉప్పు మడులు

అద్దంకి, చినగంజాం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు రైతులను నిం డా ముంచాయి. పంట చేతికి వచ్చే సమయంలో దిగుబడులు నీటి పాల య్యా యి. రెండు రోజుల క్రితం వీచిన గాలులు, వర్షానికి కొంత మేర పంటలు దెబ్బతి నగా, బుధవారం వేకువజామున వీచిన గాలులు, వర్షంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల స్తంభా లు విరిగిపడ్డాయి. అద్దంకి, బల్లికురవ, పంగులూరు, కొరిశపాడు మండలాల్లో సుమారు 1500 ఎకరాల మొక్కజొన్న పంట దెబ్బతింది. రైతులకు సుమారు రూ.10 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా. సంతమాగులూరు మండలంలో అరటి తోటలు దెబ్బతిన్నాయి. బొప్పాయి చెట్లు విరిగి కాయలు పూర్తిగా నేలపాల య్యాయి. అద్దంకి పట్టణంతో పాటు జార్లపాలెం, కలవకూరు తదితర గ్రామా లలో వైట్‌బర్లీ పొగాకు పందిళ్లు పడిపోయి నీరు చేరాయి. అద్దంకిలో సుమారు 61.2 మి.మీ వర్ష పాతం నమోదైంది. పంటలు పూర్తిగా దెబ్బతిన డంతో ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

- చినగంజాం ప్రాంతంలో బుధవారం వేకువజామున ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఉప్పు మడులలో వర్షపు నీరు నిలిచి ఉప్పు పంటకు తీవ్ర నష్టం కలిగింది. మండలంలోని చినగంజాం, సోపిరాల, కొత్తపాలెం, రాజుబంగారు పాలెం, పెదగంజాం తదితర ప్రాంతాల్లో ఇటీవలనే ఉప్పు మడుల నుంచి ఉప్పు తీయడం ప్రారంభించారు. ఉప్పు బాగా వచ్చే సమయంలో ఇలా వర్షాలు కురువ డంతో నష్టాలు చవి చూడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు వెయ్యి ఎకరాల్లో రెండు రోజులలో తీత తీయాల్సిన ఉప్పు సుమారు 50వేల బస్తాల వరకు కరిగి పోయి ఉంటుందని రైతులు తెలిపారు. గొనసపూడి, సంతరావూరు ప్రాంతాల్లో మిరప, పొగాకు పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


కాకానిపాలెంలో వైట్‌బర్లీ పొగాకు పందిళ్లలోకి చేరిన వర్షపు నీరు


చినగంజాం ప్రాంతంలోని ఉప్పు కొఠారులలో నిలిచిన వర్షపు నీరు

జేసీ ప్రఖర్‌జైన్ బదిలీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)



బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ బదిలీ అయ్యారు. ఆయన ను ఆర్టీజీఎస్ సీఈ వోగా నియమిస్తూ ప్రభుత్వం బుధ వారం ఉత్తర్వులు జారీ చేసింది. తాత్కాలికంగా ఇన్‌చార్జి జేసీని నియమించుకునే అధికారాన్ని కలెక్టర్ వెంకటమురళికి కట్టబెడుతున్నట్లు ప్రభు త్వం ఆదేశాల్లో పేర్కొంది. 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ప్రఖర్‌ను గతేడాది ఆగస్టు చివరివారంలో తొలిపోస్టింగ్‌లో ఇక్కడ జేసీగా నియమితులయ్యారు. ఏడు నెలల పాటు జేసీగా పనిచేసిన ప్రఖర్ వివాదరహితుడిగా, సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నారు.

విద్యుదాఘాతానికి చేనేత కార్మికుడి మృతి



వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ప్రమాదానికి గురై చేనేత కార్మికుడు దుర్మరణం చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని అనుమల్లిపేట గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొడ్డు మోహన్‌రావు(64) భార్య మాధవి చేనేత కార్మికులు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రోజులాగే ఉదయం సమీపంలోని చిల్లర కొట్టు వద్దకు పాల ప్యాకెట్ తెచ్చేందుకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో రోడ్డుకు అడ్డంగా ఓ ఇంటికి చెందిన విద్యుత్ సర్వీస్ వైరు మంగళవారం రాత్రి ఈదురు గాలులకు తెగిపడి ఉంది. అవగాహన లేని మోహన్‌రావు ఆ వైరును అక్కడి నుంచి పక్కకు పెట్టేందుకు చేతితో పట్టుకోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న వేటపాలెం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహానికి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు పెద్ద దిక్కును కోల్పోయి విలపించారు.

బిహార్ యువకుడి మృతి

అద్దంకి : మణికేశ్వరంలో విద్యుత్ షాక్‌తో బిహార్ రాష్ట్రానికి చెందిన యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బిహార్ రాష్ట్రం పాట్నా జిల్లా హల్దిచప్రకు చెందిన బికాస్ యాదవ్(22) మణికేశ్వరంలోని వైసీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డికి చెందిన డెయిరీ ఫాంలో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం బికాస్ మేత కటింగ్ మిషన్ వద్ద పనిచేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. సీఐ సుబ్బరాజు, ఎస్సై ఖాదర్ బాషా పరిశీలించి కేసు నమోదు చేశారు.

29న పోలేరమ్మ తిరునాళ్ల

నూతలపాడు (పర్చూరు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలం నూతలపాడులోని పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల ఈనెల 29న జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా శిడిమానోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

నేలవాలిన మొక్కజొన్న

- పలుచోట్ల బొప్పాయి, అరటికి నష్టం
- లబోదిబోమంటున్న రైతులు

పంగులూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం తెల్లవారుజామున వీచిన పెనుగాలులకు కండె గింజ పోసుకునే దశలో ఉన్న మొక్కజొన్న పైరు నేలవాలగా, వర్షం ధాటికి కల్లాలలో ఆరబెట్టిన మొక్కజొన్న తడిచాయి. మూడున్నర గంటల సమయంలో ఒక్కసారిగా వీచిన పెనుగాలులతో కూడిన వర్షంతో పంటలకు నష్టం వాటిల్లింది. తూర్పు తక్కెళ్లపాడు గ్రామంలో బలంగా వీచిన పెనుగాలికి కండె గింజ పోసుకునే దశకు



కల్లాల్లో ఆరబెట్టి ఉన్న మిర్చి

చేరుకున్న మొక్కజొన్న పైరు పదిఎకరాలకు పైగా పూర్తిగా నేలపాలై పనికి రాకుండా పోయింది. కోటపాడు, కొండమంజులూరు గ్రామాలలో మంగళవారం సాయంత్రం నూర్పిడి చేసి ఉంచిన మొక్కజొన్న రాశులు వర్షం ధాటికి నెమ్మెక్కాయి. పందిళ్లకు ఉంచిన పొగాకు తాళ్లను రైతులు వర్షానికి తడవకుండా కాపాడుకోవాలని పరిస్థితి. ఈ నెల 13న వీచిన గాలులకు కొండమూరు, రేణంగావరంలో నూర్పిడి చేరుకున్న మొక్కజొన్న నేలవాలి నష్టం వాటిల్లింది. వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులు కలవర పెడుతున్నాయి.

బల్లికురవ : గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు, గాలుల ప్రభావంతో మొక్కజొన్నపై దెబ్బ పడింది. మంగళవారం రాత్రి కొన్ని గ్రామాలలో కురిసిన భారీ వర్షం కురిసింది. బల్లికురవ మండలంలోని గంగపాలెం, కొణిదెన గ్రామాల్లో అకాల వర్షంతో మొక్కజొన్న కల్లాలపై గుండా వర్షపు నీరు పారింది. అలానే మొక్కజొన్న విత్తనాలు పూర్తిగా తడిచి పోయాయి. బుధవారం రైతులు తడిచిన మొక్కజొన్నను చూసి లబోదిబో



తూర్పుతక్కెళ్లపాడులో గాలులకు నేలకొరిగిన మొక్కజొన్న పైరు

మంటున్నారు. దెబ్బ తిన్న పంటలకు పంట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

పర్చూరు : ఆరుగాలం శ్రమించి పంటలు అకాల వర్షాలకు ఆవిరవుతున్నాయని రైతులు బోరుమంటున్నారు. మిర్చి, పొగాకు, మొక్కజొన్న రైతులు కల్లాల్లో, పందిళ్లకు ఉన్న పంటలను వానల నుంచి కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. కల్లాల్లో ఉన్న మిర్చిని ఇంటికి తెచ్చి భద్రపరుచుకుందామన్నా పూర్తి స్థాయిలో అరకపోవడం వల్ల బూజుపట్టే ప్రమాదం ఉంది. పందిళ్ళకు ఉన్న పొగాకు, పొలాల్లో ఉన్న మొక్కజొన్న, కోతకు సిద్ధంగా ఉన్న మిర్చి వర్షానికి బెబ్బతింటోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక, మరోపక్క వానలకు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకొల్లు : బుధవారం కురిసిన అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందారు. కల్లాల్లో మిర్చి, పొగాకు తడవకుండా కాపాడుకునేందుకు పరుగులు తీసారు. కొద్దిసేపటికి వాన ఆగిపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

అర్ధరాత్రి వాన

జలమయమైన రహదారులు

చీరాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలో బుధవారం అర్ధరాత్రి జోరుగా వాన కురిసింది. సుమారు రెండు గంటల పాటు విడతలవారీగా కురిసిన వర్షం కారణంగా పలు ప్రాంతాలు, రహదారులు సైతం వ ర్షపు నీటితో నిండాయి, ఈక్రమంలోనే చీరాల - బాపట్ల మధ్య రహదారిలో పలు చోట్ల జలమయంగా మారాయి. ముఖ్యంగా ఈపూరుపాలెం రోడ్లపైకి నీళ్లు నిలవడంతో వాహనదారులు, ప్రజలు అసౌకర్యం చెందారు. ఈపూరుపాలెం ప్రధాన రహదారిలో కొన్నిచోట్ల చిన్నపాటి వానకి సైతం నీళ్లు నిలుస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

మార్టూరు : బుధవారం భారీ గాలులతో కూడిన వర్షానికి పొలాల్లో కల్లాల్లో రైతులు ఆరబెట్టుకున్న మొక్కజొన్న విత్తనాలు కల్లాలో తడిసి పోయాయి. మండలంలో ద్రోణాదుల, ఇసుకదర్శినాగరాజుపల్లి, జొన్నతాళి తదిర గ్రామాలలో మొక్కజొన్న పంటను రైతులు కోశారు. వాటి విత్తనాలను పొలాల్లో కల్లాల్లో కొంతమంది ఆరబెట్టుకోగా, మరి కొంతమంది రైతులు ఇంటికి తీసుకు వచ్చి పరదాలు వేసి వాటిపై ఆర బెట్టుకున్నారు. రెండ్రోజుల నుంచి తేలికపాటి వర్షాలు కురవడం, భారీగా గాలులు వీయడంతో రైతులు అప్రమత్తంగానే ఉన్నారు. కానీ వేకువజామున అందరూ నిద్రపోయే సమయంలో భారీ గాలులతో వర్షం కురవడంతో మొక్కజొన్న రైతు లు ఉక్కిరిబిక్కిరయ్యారు. రాత్రి సమయంలో విత్తనాలను కాపాడుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వాటిని పరదాలలో వేసి ఆర బెట్టుకున్నారు. వ్యవసాయ అధికారి అంజిరెడ్డిని సంప్రదించగా గ్రామాలలో మొక్కజొన్నను కొంతమంది రైతులు మాత్రమే కోశారన్నారు. మరి కొంతమంది రైతుల పొలాల్లో ఇంకా అదేవిధంగా పంట ఉందన్నారు. అయినా తమ సిబ్బందితో గ్రామాలలో విచారిస్తామన్నారు.

సంతమాగులూరు : అకాల వర్షాలకు మిరపకాయలు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పొలంలో ఆరబెట్టిన మిరపకాయలు తడిసిపోయాయి. ఈ ఏడాది మిరపకు గిట్టుబాటు ధర లేకపోవడం, కూలి ధరలు ఎక్కువ అవడంతో రైతులు నష్టాలబారిన పడగా, తాజాగా కురిసిన వానలు నట్టేట ముంచేస్తున్నాయి.



జలమయమైన ఈపూరుపాలెం రహదారి



ద్రోణాదులలో ఆరబెట్టిన మొక్కజొన్న విత్తనాలు



గంగపాలెంలో మొక్కజొన్న కల్లాల్లో వాన నీరు

జాగ్రత్తలతోనే అగ్ని ప్రమాదాల నివారణ

అద్దంకి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని అద్దంకి అగ్నిమాపక అధికారి వెంకట్రావు అన్నారు. మూడోరోజు వారోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని శ్రీనగర్‌లోని శ్రీలక్ష్మీ రెసిడెన్సీలో అగ్ని ప్రమాదాల నివారణపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ వంట గదులలో చిన్న చిన్న ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి పడకుండా జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదం నుంచి బయటపడవచ్చన్నారు. గ్యాస్ సిలిండర్ లీకైనట్లు అనుమానం వస్తే కరెంట్ స్విచ్‌లు వేయవద్దన్నారు. 10 వార్డు కౌన్సిలర్ సుధీర్, లీడింగ్ ఫైర్ మాన్ చంద్రశేఖర్, రమణయ్య, కోటేశ్వరరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

చీరాల : అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు భయపడకుండా నియంత్రణపై దృష్టి సారించాలని చీరాల అగ్నిమాపక కేంద్రం అధికారి రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని పలు అపార్ట్‌మెంట్స్, వార్డుల్లో ప్రమాదాలపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



ప్రజా దర్బార్‌లో అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొని సమస్యలపై ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. 219 అర్జీలు రాగా, అందులో నివేశన స్థలాలు 134, పెన్షన్ 70, రేషన్‌కార్డులు 10, మరో ఐదు ఇతరవి ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందిన అర్జీలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు వివరించారు. ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కౌతవరపు జనార్దనరావు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వేలో పారదర్శకత పాటించండి

తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దత్త క్షేత్రం, రోశయ్య కాలనీ, చేనేత కాలనీల్లో సర్వే నిర్వహిస్తున్న ప్రత్యేక బృందాలు పారదర్శకంగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ పార్వతి సూచించారు. బుధవారం నుంచి ఆ మూడు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు సర్వే ప్రారంభించాయి. తహసీల్దార్ పార్వతి సర్వే తీరును పరిశీలించారు. స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. మొత్తం 2వేల పట్టాలు పరిశీలించ నుండగా తొలిరోజు 680 పట్టాలను పరిశీలించినట్లు తహసీల్దార్ తెలిపారు.



ఇంటి పత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్వతి

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

బల్లికురవ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించేలా అవగాహన కల్పించాలని మార్టూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఏడీఏ కె.శ్రీనివాసరావు కోరారు. బుధవారం బల్లికురవ వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికపై అన్ని గ్రామాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ సంఘాల అధ్యక్షులకు మండల స్థాయి శిక్షణ ఇచ్చారు. ఏడీఏ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో గ్రామాలలో అందుబాటులో ఉండే పలు రకాల వస్తువులతో పంటలు సాగు చేసేలా యాక్షన్ ప్లాన్ తయారు చేసి, రైతులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కుమారి, వెలుగు ఏపీఎం రాజారావు, మాస్టర్ ట్రైనర్ అప్పారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల): ప్రస్తుత పరిస్థితులలో అధిక సంఖ్యలో ప్రజలు అనారోగాల బారిన పడుతున్నారని ఈక్రమంలో ప్రకృతి సేద్యంతో జీవన మనుగడ సులువుగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి వై రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయాధికారి వాణిశ్రీ అన్నారు. వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథ్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎపిఎం అంజిబాబు, భారతి పాల్గొన్నారు.

20న ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

బల్లికురవ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలమవారిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయస్వామి వారి వార్షిక తిరునాళ్ల ఈ నెల 20వ తేదీన ఆదివారం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. టీడీపీ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పోలీసు శాఖ అనుమతులు పొంది విద్యుత్ ప్రభ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

డ్రాపౌట్స్‌ను పాఠశాలలో చేర్పించండి

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మధ్యలో స్కూల్ మానేసిన డ్రాపౌట్స్ పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించడంతోపాటు మీ పిల్లలను యూకేజీలో చేర్పించాలని ఎంఈవో చిలుకూరి గోపి అన్నారు. బుధవారం యద్దనపూడిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో ఎంపీడీవో లక్ష్మీనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో గోపి మాట్లాడుతూ బడికి పిల్లలు అందరూ వచ్చే విధంగా చూడాలన్నారు. సమావేశంలో సీడీపీవో సుభద్ర, ప్రధానోపాధ్యాయుడు దేవేంద్రరావు, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే దళితుల అభివృద్ధి

పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేష్

పర్చూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : దళితుల అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బేతపూడి సురేష్ అన్నారు. ఎస్సీ ఉప వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయానికి పార్టీ కట్టుబడి ఉందని చెప్పేందుకు వర్గీయరణకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నిదర్శనమన్నారు. కార్యక్రమంలో గద్దె అశోక్, లక్కిపోగు సుమన్, తమ్మలూరి అశోక్, కట్టింపూడి డేవిడ్, బాబూరావు, మోషే, వీరయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రొఫైల్స్‌ను సిద్ధం చేయాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పాఠశాలలోని విద్యార్థి ప్రొఫైల్ సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని చీరాల డిప్యూటీ ఈవో డీ గంగాధరరావు సూచించారు. బుధవారం అద్దంకిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం హెచ్‌ఎం డీఎస్ పద్మావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ ఈవో మాట్లాడుతూ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి తరువాత తరగతికి ప్రమోట్ చేసే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహించి 21వ తేది నుంచి తరగతిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల పునఃప్రారంభం నాటికి ఆపార్ ఐడీ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

అద్దంకి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో నిందితులను పోలీస్‌లు అరెస్ట్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఎదరు కొత్తపేట రోడ్డులో పల్లబోతు రోశమ్మ ఇంట్లోని బడ్డీ కొట్టులో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను బుధవారం పోలీస్‌లు అరెస్ట్ చేశారు. సోమవారం రాత్రి రోశమ్మ బడ్డీ కొట్టులో ఇందిరానగర్‌కు చెందిన షేక్ గఫూర్, షేక్ మహ్మద్ రఫీ చోరీకి పాల్పడ్డారు. గఫూర్, మహ్మద్ రఫీని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.12 వేలు, 5 గ్రాముల చెవి కమ్మలు, సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పంగులూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు క్రమం తప్పకుండా పౌష్టిక ఆహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కొరిశపాడు సీడీపీవో కృష్ణకుమారి సూచించారు. పంగులూరు ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మూడు మండలాల స్థాయిలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం తిన్న గర్భిణులు ఆరోగ్యవంతులైన శిశువులకు జన్మనిస్తారని తెలిపారు. పుట్టిన బిడ్డకు తల్లి పాలు క్రమం తప్పకుండా ఇవ్వాలని ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు.

మంత్రి లోకేష్‌తో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

పర్చూరు అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ



మంత్రి లోకేష్‌తో ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి, సంక్షేమం, పర్చూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, పార్టీ నిర్మాణం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ఈసందర్భంగా లోకేష్ మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలన్నారు. అందుకు అవసరమైన సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఏలూరి తెలిపారు. చినగంజాం మోటుపల్లి సముద్ర తీర ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, ఓడల తయారీ పరిశ్రమ, నేషనల్ హైవేలను కలుపుతూ జాతీయ రహదారులు, నూతన మార్కెట్ యార్డుల నిర్మాణం, రెవెన్యూ డివిజన్ కార్యాలయం, ఆటోనగర్ నిర్మాణం తదితర అంశాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థులను అభినందించిన ఏలూరి

మార్టూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ 2024-25 పరీక్షా ఫలితాలలో శ్రీచైతన్య మార్టూరు బ్రాంచి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దాంతో వారిని బుధవారం స్కూల్ ఉపాధ్యాయులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి తీసుకొచ్చారు. అక్కడ ఎమ్మెల్యే చేతులుమీదుగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. 6వతరగతి విద్యార్థి షేక్ రయాన్ మస్తాన్ గ్రాండ్ ప్రైజ్‌గా లాప్ టాప్‌ను, 4వతరగతి విద్యార్థి మహేష్‌కు ట్యాబ్‌ను అందజేశారు.

ఉత్తమ చదువులతో ఉన్నత శిఖరాలు

చీరాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమంగా విద్యాభ్యాసం సాగించడం వలన ఉన్నత శిఖరాలను అందుకుంటారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.స్నేహలత పేర్కొన్నారు. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన దాత్రిశ్రీ, అనూష, బ్లెస్సీ భావన రామేశ్వరిని అభినందించారు.

చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి సారించండి

కొత్తపేట(చీరాల), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద తయారీపై సిబ్బంది కచ్చితంగా అవగాహన పొందాలని డీఎల్‌పీవో శివన్నారాయణ అన్నారు. బుధవారం వేటపాలెం మండల పరిధిలోని కొత్తపేట పంచాయతీ కార్యాలయంలో మండలంలోని తొమ్మిది పంచాయతీల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్, ఈవోఆర్డీ అన్నం శ్రీనివాసరావు, సెక్రటరీ రమేష్, మండల పరిధిలోని కార్యదర్శులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు బస్టాండ్‌ను పరిశీలించిన ఆర్టీసీ ఈడీ

ఇంకొల్లు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు బస్టాండ్‌ను నెల్లూరు జోన్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు నాగేంద్రప్రసాద్ బుధవారం పరిశీలించారు. ప్రయాణికుల సంఘ అధ్యక్షుడు మోహనకృష్ణ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్, శ్రీశైలం, బెంగళూరుకు బస్సు సర్వీసులు నడపాలని, గుంటూరు-పర్చూరు పల్లెవెలుగు బస్సులను ఇంకొల్లు వరకు పొడిగించాలని, నైట్‌హాల్ట్ బస్సులను తిప్పాలని విన్నవించారు. పావులూరు రోడ్డులోని డిపో స్థలాన్ని నాగేంద్రబాబు పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఎం రవికాంత్, చీరాల డీఎం శ్యామల, సివిల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, కంట్రోలర్ బాబు ఉన్నారు.

పందిళ్లపల్లిలో గ్రామసభ

పందిళ్లపల్లి(చీరాల), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పందిళ్లపల్లి పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ మాల్యాద్రి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలతో గ్రామ సభ నిర్వహించారు. ఈకేవైసీ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

అధికారులతో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేశించిన విధుల్లో భాగంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలాలకు చెందిన తహసీల్దార్‌లు, హౌసింగ్, ఇరిగేషన్, రీసర్వే సిబ్బందితో బుధవారం ఆర్డీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇప్పటికే సేకరించిన నివేశన స్థలాల అర్హుల జాబితాను అందజేయాలని సూచించారు. హౌసింగ్‌కు అర్హుల జాబితాపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే నీటి పన్ను వసూళ్లపై ఆరా తీ శారు. సేకరించిన డేటాను ఎప్పటికప్పుడు కార్యాలయానికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

పంగులూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మడల అభివృద్ధికి పాటుపడాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరిగింది. ఎంపీడీవో స్వరూపారాణి మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాల అలమలుకు ప్రజా ప్రతినిధులు తమ సహకారం అందించాలని కోరారు. పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలను విద్యుత్ సబ్ ఇంజనీర్ ఆంజనేయులు వివరించగా, సీసీఆర్సీ కార్డులు పొందడం ద్వారా కౌలు రైతులకు రాయితీలు అందుతాయని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా నీటి ట్యాంకులను సాగర్ జలాలతో నింపే విషయంలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది సహకరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య కోరారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు ప్రమీల, పీ హెచ్ సీ వైద్యాధికారి బాలరాజేశ్వరి, ఎం ఈవో వీరాంజనేయులు, పీఆర్ ఏఈ హ నుమంతరావు, ఆర్ఐ శ్వేత, పశువైద్యాధికారి మురళీకృష్ణ, ఏపీఎం జ్యోతి ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల ప్రస్తావనే లేదు

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

మార్టూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఉన్న ప్రజల సమస్యలను ప్రస్తావించడానికి, అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిదులు,ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మండల సర్వసభ్య సమావేశాన్ని వేదికగా ఎంచుకుంటారు. అయితే బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో గ్రామాలలోని ప్రజల సమస్యలను సభలో మాట్లాడిన ప్రజాప్రతినిదులు లేరంటే అతిశయోక్తికాదు. మండలంలో 21 మంది ఎంపీటీసీ సభ్యులుండగా, కేవలం 9 మంది మాత్రమే హాజరుకాగా, సర్పంచ్‌లు ముగ్గురు హాజరయ్యారు. ఏ గ్రామ సమస్యపైనా అడిగే వారు లేరు. ఇక అధికారులు కూడా ఆయా శాఖలకు చెందిన వివరాలను మొక్కుబడిగా చదివి వెళ్లిపోయారు. ఎంపీపీ భూక్యా శాంతిబాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ 2025-26కు సంబంధించి అభివృద్ధి పనులు, మంజూరుకు సంబంధించి ప్రణాళికను పంపాల్సిందిగా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లను కోరారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ విష్ణుతేజ మాట్లాడుతూ ఆస్పత్రి ఆవరణలో సీసీ రోడ్డు మంజూరుచేయాలని, గ్రామ పంచాయతీ వారు మంచినీటి వసతి పైపు లైనును ఏర్పాటుచేయాలని కోరారు. హౌసింగ్ సూపర్‌వైజర్ హరి మాట్లాడుతూ మండలంలో 695 మంది ప్రభుత్వ పక్కాగృహాలు నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నారని, వారికి సబందించిన కుల,ఆదాయ,ప్రొవిజనల్ సర్టిఫికెట్లను పంపించేవిధంగా చూడాలని ప్రజా ప్రతినిధులను కోరారు.



మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ విష్ణుతేజ



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	36.3	23.4
కావలి	35	28
ఆత్మకూరు	36	27
ఉదయగిరి	37	26
కందుకూరు	36	28

కేటాయింపులు సరే..
నీరు పారేదెలా ?

- ఇప్పటికీ పంట కాలువల్లో తొలగని పూడిక
- లస్కర్ల నియామకానికి రాని అనుమతులు
- ప్రజాప్రతినిధుల జోక్యం ఎంతో అవసరం
- నేడు ఐఏబీ సమావేశం



గుర్రపుడెక్కతో నిండిన ఇందుకూరుపేట మండలం గంగపట్నంలోని ప్రధాన కాలువ

నెల్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రికార్డు స్థాయి విస్తీర్ణంలో జిల్లాలో రెండో పంట సాగు చేసుకునేందుకు అవకాశం లభించింది. ప్రాజెక్టుల్లో ఉన్న నీటితో ఐదు లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టుకు నీటి కేటాయింపులు జరిపేందుకు గురువారం (నేడు) సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశం నిర్వహించనున్నారు. ఏ కాలువ కింద ఎంత ఆయకట్టు వరకూ సాగుకు నీరివ్వాలన్నది ఈ సమావేశంలో తీర్మానిస్తారు. మే 1 నుంచి రెండో పంటకు నీటి విడుదల ప్రారంభించనున్నారు. ఇప్పటికే రైతాంగం దుక్కులు సిద్ధం చేసుకుంటోంది. అయితే ఇప్పటికీ పంట కాలువలు అభివృద్ధికి నోచుకోలేదు. మొదటి పంట పూర్తి ఆయకట్టులో సాగు జరగడంతో అన్ని కాలువలు పూడిక, గుర్రపు డెక్కతో నిండిఉన్నాయి. నీరు సక్రమంగా పారని విధంగా రూపుకోల్పోయాయి. ఈ కాలువలను బాగు చేసేందుకు ఇంత వరకూ ఎలాంఠి చర్యలు చేపట్టలేదు.

● ప్రతిపాదనలకు రాని అనుమతులు

జిల్లా వ్యాప్తంగా కాలువలు, చెరువులు, తూములు, షట్టర్లను బాగు చేసేందుకు ఇరిగేషన్ అధికారులు రూ.144 కోట్లతో ఓఅండ్ఎం పనులకు ప్రతిపాదనలు పంపారు. ఇది జరిగి కూడా నెల దాటింది. కానీ ఇంతవరకూ ప్రభుత్వం నుంచి అనుమతులు లభించలేదు. ఎందుకు ఇంత ఆలస్యం చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి. జిల్లా నుంచి వెళ్లిన ప్రతిపాదనలన్నింటికీ ఆమోదం ఇవ్వకపోయినా కనీసం కాలువల్లో నీరు సాఫీగా పారేందుకు పూడికతీతకైనా అనుమతులు ఇవ్వాల్సి ఉండగా, ఇరిగేషన్ అధికారులు ఆ దిశగా కూడా ఆలోచన చేయడం లేదు. ఇప్పటికిప్పుడు అనుమతులు ఇస్తే గానీ నీటి విడుదల చేసే నాటికి కాలువలను బాగు చేయడం సాధ్యపడదు. ప్రస్తుతం వేసవి సీజన్ కావడంతో ఆవిరిశాతం కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో కాలువలు శుభ్రంగా లేకపోతే చివరి ఆయకట్టు వరకూ సక్రమంగా నీరందించడం సాధ్యపడదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● లస్కర్ల నియామకం మరిచారా..?

సాగునీటి రంగంలో లస్కర్లు కీలకంగా వ్యవహరిస్తుంటారు. నీరు వృథా కాకుండా ప్రతీ ఎకరాకు సక్రమంగా అందేలా చేయడంలో వీరిది ప్రధాన పాత్ర. గత మూడేళ్లుగా వీరు లేకపోవడంతో రైతులే అవస్థలు పడుతూ కాలువలపై చెక్కలు, షట్టర్లు ఎత్తుకోవడం, దించుకోవడం చేయాల్సి వస్తోంది. దీంతో నీరు వృథా అవుతోంది. కొన్ని చోట్ల రైతుల మధ్య నీటి పంపకాల విషయంలో వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం కాలువల కింద నిర్దేశిత ఆయకట్టు వరకే నీరు ఇవ్వనున్నారు. అంతకు మించి ఆయకట్టులో సాగు చేస్తే పంట చివరి దశలో సాగునీటి ఇబ్బందులు తలెత్తుతాయి. ఆ సమయంలో అనధికార ఆయకట్టులో సాగు చేయకుండా అడ్డుకోవడమే కాకుండా అక్కడకు నీరు ఇవ్వకుండా చూడాల్సిన బాధ్యత కూడా అధికార యంత్రాంగంపై ఉంటుంది. క్షేత్రస్థాయిలో ఈ పనిని లస్కర్లే చేయాల్సి ఉంది. కానీ ఈ లస్కర్ల నియామకం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్న లస్కర్లను వైసీపీ ప్రభుత్వంలో వేతనాలు కూడా చెల్లించకుండా అర్ధంతరంగా తొలగించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఉన్న కొందరు నాడు ప్రతిపక్షంలో ఈ లస్కర్ల తరపున పోరాడారు. అయితే ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాత్రం లస్కర్ల నియామకంలో చొరవ తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా నుంచి ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా రాష్ట్రస్థాయిలో అనుమతులు లభించడం లేదని అధికారులు చెబుతుండడం గమనార్హం. ఏటా ఇరిగేషన్ పర్నుల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తుండగా, రూ.2 కోట్లు వేతనాలు ఇచ్చి లస్కర్లను నియమించలేకపోతున్నారు.

ఎన్ఎంసీ కమిషనర్ బదిలీ

- ఏడాది కాకముందే స్థానచలనం
- వివాదాస్పదంగా సూర్యతేజ నిర్ణయాలు
- రాజకీయ కారణాలుండవచ్చని చర్చ

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 16, (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర పాలక సంస్థ (ఎన్ఎంసీ) కమిషనర్ మల్లవరపు సూర్యతేజ బదిలీ అయ్యారు. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఎండీగా ఆయన్ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ బదిలీ వెనుక రాజకీయ కారణాలు ఉండవచ్చనే చర్చ కార్పొరేషన్ వర్గాల్లో సాగుతోంది.



● ఏడాది కాకముందే...

గత జూలై 7న ఎన్ఎంసీ కమిషనర్‌గా సూర్యతేజ బాధ్యతలు చేపట్టారు. ఏడాది కాకముందే ఆయన బదిలీ కావడం చర్చనీయాంశమైంది. గత 9 నెలల కాలంలో ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు వివాదస్పదమయ్యాయి. కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంలో ఆర్వో, ఆర్ఐలను మూకుమ్మడిగా బదిలీ చేసిన ఆయన, 10 మంది ఆర్ఐల పరిధిని ఆరుకు కుదించారు. ఇద్దరు ఆర్వోల పరిధిని ఒకరికి మాత్రమే కట్టబెట్టారు.ఈ వ్యవహారం ఇటు ఉద్యోగులు, అటు రాజకీయ నాయకుల ఆగ్రహానికి గురైంది. అంతేకాక ఎలాంటి అనుభవం లేని కొందరు ఉద్యోగులను అందలం ఎక్కించారు. ఎక్కడాలేని విధంగా రెవెన్యూ అధికారులతో శానిటేషన్ విధులు నిర్వర్తింపజేశారు. మేయర్‌తోనూ సఖ్యత సాగించలేకపోయారు. అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు ఆపేయడంతోపాటు, మంజూరుకు సిద్ధంగా ఉన్న బిల్లులను వెనక్కు పంపి, కాంట్రాక్టర్లలో గందరగోళాన్ని నింపారు. ప్రజాప్రతినిధులతో సమన్వయం లేకుండా, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని కొంతమంది అధికార పార్టీ నేతలు రాజధాని స్థాయిలో ఆయనపై ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో బదిలీ అంశం చర్చనీయాంశమైంది.

● కొత్త కమిషనర్ ఎవరు ?

సూర్యతేజ స్థానంలో ఎవరు వస్తారనేది ఉత్కంఠగా మారింది. మళ్లీ ఐఏఎస్ స్థాయి అధికారే వస్తారా...? లేదా నాన్ ఐఏఎస్‌తో సరిపెడతారా...? అన్నది అధికార వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రస్తుతం మంగళగిరి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న అలీంబాషాను ఇక్కడ బదిలీ చేస్తారనే ఊహాగానాలు నడుస్తున్నాయి.

ఎమ్మెల్సీగా రెండోసారి
బీద రవిచంద్ర ప్రమాణం




శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు చాంబర్‌లో ప్రమాణస్వీకారం చేస్తున్న బీద రవిచంద్ర

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : 'బీద రవిచంద్ర అనే నేను శాసనమండలి సభ్యుడి(ఎమ్మెల్సీ)గా ప్రమాణం చేస్తున్నా'నని బుధవారం ఆయన ప్రమాణం చేశారు. మండలి చైర్మన్ మోషేన్‌రాజు సచివాయంలోని తన చాంబర్‌లో బీద రవిచంద్రతో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మంతెన సత్యనారాయణ రాజు, టీడీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జెడ్ శివ ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నేత గూటూరు మురళీ కన్నబాబు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి, ఇతర నాయకులు బీ గిరి, సూర్యప్రకాష్, నాగేంద్ర బ్రహ్మంచౌదరి, పలగాటి శీనయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు బీద రవిచంద్ర దంపతులను సన్మానించారు. గతంలో ఓసారి ఎమ్మెల్సీ పనిచేసిన బీద బుధవారం రెండోసారి ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టారు.

ఈదురుగాలుల
బీభత్సం

- పలుచోట్ల నేలకూలిన స్తంభాలు, చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- 95 ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- అల్లూరులో కుండపోత వాన
- వర్షంతో అక్కడక్కడా తడిసిన ధాన్యం



గాలివానకు అనంతసాగరంలో దెబ్బతిన్న బొప్పాయి పంట



కలువాయిలో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు



విద్యుత్ తీగలు తగిలి మృతిచెందిన గేదెలు

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో ఒక్కసారిగా చోటుచేసుకున్న మార్పులతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం ఈదురుగాలులతో స్వల్పంగా వర్షం కురిసింది. దీంతో ఉద్యాన పంటలు బాగా దెబ్బతిన్నాయి. అక్కడక్కడా ఆరబెట్టిన ధాన్యం తడిసింది. గాలివాన కారణంగా జిల్లాలో సుమారు 95 ఎకరాల్లో వివిధ ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ ప్రాథమిక అంచనా వేసింది. జిల్లాలోని పలుప్రాంతాల్లో బొప్పాయి, అరటి, నిమ్మ, మునగ పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. జిల్లాలో వింజమూరు, మర్రిపాడు, కలువాయి మండలాల్లోనే అధికంగా పంటలు దెబ్బతిన్నాయి. వింజమూరు మండలంలో ఏడుగురు రైతులకు చెందిన 22 ఎకరాల్లోని అరటితోట దెబ్బతింది. కలువాయి మండలం తెలుగురాయపురంలో ఇద్దరు రైతులకు చెందిన 10 ఎకరాల మునగ చెట్లు నేలవాలాయి. ఉయ్యాలపల్లిలో 43 ఎకరాల్లో నిమ్మ, కలువాయిలో 3.8 ఎకరాల్లో అరటితోటలు దెబ్బతిన్నాయి. మర్రిపాడు మండలం పొంగూరులో నలుగురు రైతులకు చెందిన 10 ఎకరాల్లోని బొప్పాయి, మరో రైతుకు చెందిన ఎకరా నిమ్మతోట దెబ్బతింది. అనంతసాగరం మండలం అమనిచిరువెళ్లలో 5 ఎకరాల్లో సాగు చేసిన బొప్పాయి దెబ్బతింది. మొత్తం మీద 95ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వివిధ ప్రాంతాల్లో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది.

● ఆరు గేదెల మృతి

ఈదురు గాలులకు బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ కొత్తకడపాలెం పొలాల్లో విద్యుత్ స్తంభం విరిగిపడి తీగలు తెగిపోయాయి.ఆ తీగలు తగులుకొని ఐదు గేదెలు, దూడ అక్కడికక్కడే మృతిచెందాయి.

● అల్లూరులో కుండబోత వర్షం

అల్లూరులో బుధవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. అరగంటపాటు వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి.

● విద్యుత్ సరఫరాకు అంతరాయం

బలంగా వీచిన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులకు లింగసముద్రం మండలంలో విద్యుత్ వ్యవస్థ దెబ్బతింది.దీంతో 12 గంటలపాటు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే కలువాయి మండలంలో ఈదురు గాలులకు తెలుగురాయపురం-కోటితీర్థం మధ్యలో రోడ్డుకు అడ్డంగా తాటిచెట్లు కూలిపోయాయి. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. తోపుగుంట సమీపంలో విద్యుత్ స్తంభాలు పడిపోవ డంతో సరఫరా నిలిచిపోయింది.

30న జడ్పీ సమావేశం

నెల్లూరు,(జడ్పీ) ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో విద్యారమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు జడ్పీలోని సమావేశ మందిరంలో ఈ సమావేశం నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యవసాయాశాఖ, గ్రామీణ నీటిసరాపరశాఖల పని తీరు, జడ్పీ బడ్జెట్ పై సమావేశంలో చర్చిస్తామని, సభ్యులంతా హాజరు కావాలని ఆమె తెలిపారు.

తుది దశకు
వర్క్ ఫ్రం హోం సర్వే

- జిల్లాలో 18 నుంచి 50 ఏళ్లలోపున్న వారి వివరాల సేకరణ
- కలిసిన కుటుంబాలు 5,95,817
- సర్వే చేసిన జనాభా 12,91,991 మంది
- వివిధ పనులు చేస్తున్నవారు 2,18,890
- ఇంటి నుంచి పనిచేస్తున్నవారు 14,182
- ఏ పనీ చేయనివారు 7,48,735

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కూటమి ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా జిల్లాలోని నగరపాలకసంస్థతో పాటు, పట్టణాలు, గ్రామాల్లో 18 నుంచి 50 ఏళ్లలోపున్న వారు ఏమి చేస్తున్నారనే వివరాలు సేకరించింది. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికి వెళ్లి వర్క్ ఫ్రం హోం పేరిట సర్వే చేశారు. ఇంటి నుంచి పని చేయడానికి బ్రాడ్ బ్యాండ్, వైఫై సదుపాయం, ఇంటర్నెట్ కనెక్షన్ ఉందా? అనే వివరాలు నమోదు చేశారు.ఈ సర్వేలో జిల్లాలో 7,48,735 మంది ఏపనీ లేక ఖాళీగా ఉన్నట్లు తేలింది.

● ఎస్ఆర్‌పురంలో పనిమంతులు ఎక్కువే..

ముఖ్యంగా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 1,42,408 కుటుంబాలను సర్వే చేశారు. ఈసర్వేలో 18 నుంచి 50 ఏళ్ల లోపు వారు 3,05,751 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 60,771 మంది వివిధ పనులు చేస్తున్నారు. వర్క్ ఫ్రం హోంలో 5,272మంది పనిచేస్తున్నారు. ఏ పనీలేని వారు 1,34,097 మంది ఉన్నారని గుర్తించారు. కావలి అర్బన్‌లో 53,229 మందిని సర్వే చేయగా 11,997 మంది వివిధ పనులు చేస్తున్నారు. ఏపనీ చేయని వారు 30,555 మంది ఉన్నారు. బుచ్చి నగర పంచాయతీలో 41,190 మందిని సర్వే చేయగా, వారిలో 8,115 మంది రకరకాల పనులు చేస్తున్నారు. 24,178 మంది ఏపనీ చేయటం లేదని తేలింది. కందకూరులో 31,895 మందిని సర్వే చేయగా, 6,774 మంది వివిధ పనులు చేస్తున్నారు. 18,010 మంది ఏపనీ చేయటంలేదని తేలింది. ఏ పనీ లేకుండా ఉన్నవారు నెల్లూరు, కావలి, బుచ్చి తరువాత పొదలకూరులో 24,178 మంది, అత్యల్పంగా సీతారామపురం(ఎస్ఆర్‌పుం)లో 6,602 మంది ఉన్నారు. దుత్తలూరులో 8,560మంది, వరకుంటపాడులో 8,422 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా తీసుకుంటే 5,95,817 కుటుంబాలను సర్వే చేయగా, ఈ కుటుంబాల్లో 12,92,786 మంది జనాభా ఉన్నట్లు నిర్ధారించారు. వీరిలో 12,91,991 మందిని సర్వేను పూర్తి చేశారు.



మహిళనడిగి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుంటున్న సచివాలయ ఉద్యోగిని

అందులో 2,18, 890 మంది వివిధ ఉద్యోగాలు చేస్తున్నారు. 7,48,735 మంది ఏ ఉద్యోగం లేకుండా ఉన్నారు. 14,182 మంది వర్క్ ఫ్రం హోంలో ఉన్నారని తేలింది. సాధారణంగా పట్టణాల్లో పనిదొరుకుతుం దని ఎక్కువ మంది గ్రామాల నుంచి పట్టనాలకుకు వలస వస్తుంటారు. కానీ జిల్లాలోని పట్టణాల్లోనే ఏపనీ లేని వారు అధికంగా ఉండడం గమనార్హం.



వర్క్‌ఫ్రం హోం ఉద్యోగి ఫొటో తీసుకుంటున్న సచివాలయ ఉద్యోగి

● ఇంటి నుంచే పనిచేసుకునేలా..

కూటమి ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లలో ఇంటి నుంచే పనిచేసుకునేలా నిరుద్యోగులకు అవకాశాలు కల్పించనుంది. వయసులవారీగా ఉపాధి అవకాశాలు కూడా కల్పించనుంది. డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువ తకు శిక్షణ ఇచ్చి సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నది. ఇందు కోసం వర్క్ ఫ్రం హోం సర్వేను ప్రభుత్వం చేపట్టింది. ఈ సర్వే ప్రస్తుతం జిల్లాలో 99 శాతం పూర్తయింది. మిగిలిన ఒకశాతం పూర్తయితే ఆ వివరాలను అధికారులు ప్రభుత్వానికి పంపనున్నారు.

● సర్వేతో మంచి అవకాశం

రాష్ట్రంలో ఐటీ కంపెనీలతోపాటు, పలు నూతన కంపెనీలు అతి త్వరలో ఏర్పాటు కానున్నాయి. దీంతో ఈ సర్వే ప్రాధాన్యత సంతరించుకోనుంది. ఈ సర్వే వివరాల ప్రకారం ప్రభుత్వం ప్రతి కుటుంబంలోని నిరుద్యోగికి తప్ప కుండా ఏదో ఒక కంపెనీలో వర్క్ ఫ్రం హోం పద్ధతిలో ఉపాధి కల్పించే అవకాశం ఉంది. లేదా నేరుగా ఉపాధి చూపించే వీలుంది.

ప్రభుత్వానికి వివరాలు పంపుతాం

జిల్లాలో 99 శాతం వర్క్ ఫ్రం హోం సర్వేను పూర్తి చేశాం. మిగిలిన ఒకశాతం సర్వేను కూడా పూర్తి చేసి వివరాలను ప్రభుత్వానికి పంపుతాం. దీంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడే వీలుంది.

- హాఫీజ్, సచివాలయాల జిల్లా పర్యవేక్షణ అధికారి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100) : 415

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9128
వెండి కిలో ధర	రూ. 99.600
వెండి ఒక గ్రాము	రూ.102.60

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభం

కొండాపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందవచ్చని ఎంపీడీవో ఆదినారాయణ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీలు, వీవోఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది రూపాయలు పెట్టి రసాయన ఎరువులు వాడకం రైతులకు అధిక భారమవుతుందని దీనికి బదులుగా సేంద్రియ ఎరువులు వాడి అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

లింగంగుంటలో వృద్ధురాలి మృతదేహం

గుడ్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గుడ్లూరు లింగం గుంటలో వృద్ధురాలి మృతదేహం బుధవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. గుడ్లూరు తెట్టు రోడ్డులోని కల్యాణ మండపం సమీపంలో నివాసం ఉండే సాదినేని సుశీలమ్మ (70) రెండు రోజుల క్రితం కుటుంసభ్యులతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ క్రమంలో లింగం గుంటలో నీటిపై తేలాడుతున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు ఘటనస్థలానికి చేరుకొని మృతురాలు సుశీలమ్మగా గుర్తించి వెలికితీసి అంత్యక్రియలు నిర్వహించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదని ఎస్‌ఐ వెంకట్రావు తెలిపారు.

21 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

కందుకూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌సెంటర్‌లో మూడు నెలల ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణకు అర్హులని తెలిపారు. ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న నూతన బ్యాచ్‌లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆయన తెలిపారు.

నేడు ప్రజావేదిక

వలేటివారిపాలెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం ఉపాధి హామీ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరుగుతుందని ఎంపీడీవో నరేంద్రదేవ్, ఏపీవో దయాసాగర్ బుధవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పంచాయతీరాజ్‌శాఖల్లో చేపట్టిన పనులపై గత నెలలో క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహించారని పేర్కొన్నారు. గ్రామాల్లో చేపట్టిన సామాజికి తనిఖీ బృందం గుర్తించిన వివరాలను ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధిహామీ క్షేత్రసహాయకులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

పార్కుల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

● ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి

కావలిటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పార్కుల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఇంటింటికి ఎమ్మెల్యే.. సమస్య మీది పరిష్కారం నాది.. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన 8వ వార్డులో పర్యటించారు. వార్డులోని వరవ కాలువ దుస్థితిపై స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా స్పందించిన ఆయన కాలువను ఎందుకు పట్టించుకోవడం లేదని అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, డీఈలను ప్రశ్నించారు. అనంతరం వివేకానంద పార్కును సందర్శించి నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలి అభివృద్ధే తన ప్రధాన అజెండా అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖమర్‌బాబు, షాకీరా బేగం, చవల రామకృష్ణ, రహీం, షబ్బు, పట్టణ అధ్యక్ష కార్యదర్శి గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబురావు, పోట్లూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.



వరవ కాలువ దుస్థితిపై కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

వైసీపీ మైనార్టీ నేతలు టీడీపీలో చేరిక

వైసీపీ మైనార్టీ నాయకులు బుధవారం ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వైసీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మొగల్ రహీం బేగ్, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు షమ్మా, రూరల్ మండల మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు పీర్‌మొహమ్మద్, వైసీపీ జిల్లా కమిటీ నాయకురాలు పర్వీన్‌జాని తదితరులకు ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కండువాలు వేసి ఆహ్వానించారు.

లక్ష్యంతో చదివి ఉన్నతస్థితికి చేరాలి

● ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత స్థితికి ఎదగాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణలో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. దాతల తోడ్పాటుతో ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారం భించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యా సంవత్సరం ప్రారంభ మయ్యాక మూడు నాలుగు నెలలకు పాఠ్య పుస్తకాలు సరఫరా చేసేవారని, కానీ ప్రస్తుత విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ముందుచూపుతో ముందస్తుగానే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయిస్తున్నారని తెలిపారు. దాత లను ఎమ్మెల్యే ఇంటూరి, ఎమ్మెల్యేను ప్రిన్సిపాల్ నాగూర్‌వలీ సత్కరించారు.



టీఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలో అబ్దుల్‌కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

వైభవంగా సీతారాముల ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజ స్తంభం ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

కందుకూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని దివివారిపాలెంలో నూతనంగా నిర్మించిన సీతా సమేత కోదండరామాలయంలో విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం, మహాకుంభాభిషేకం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా జరిగాయి. మూడు రోజులుగా శాస్త్రోక్తంగా యజ్ఞయాగాలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం బుధవారం ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేలాదిమంది భక్తుల సమక్షంలో వేడుకగా నిర్వహించారు. ఆలయ నిర్మాణంకు తోడ్పాటునందించిన దివి రవీంద్రనాథ్‌కు అభినందనలు తెలిపారు. యజ్ఞంలో దివి రవీంద్రనాథ్, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, లింగయ్యనాయుడు దంపతులు తదితరులు పాల్గొన్నారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తదితరులు హాజరై పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

వ్యక్తి వికాసానికి పునాది ప్రభుత్వ పాఠశాలలు

లింగసముద్రం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : వ్యక్తి వికాసానికి, సమాజ మార్పుకు పునాదులు ప్రభుత్వ పాఠశాలలని ఎంఈవో-2 శివకుమార్ చెప్పారు. బుధవారం లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో కాంప్లెక్స్ పరిధిలోని 15 పాఠశాలలకు చెందిన 78 మంది 5వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యు మాధవరావు పర్యవేక్షణలో జరిగిన టాలెంట్ టెస్ట్ ఎంఈవో శివకుమార్ పరిశీలించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొగిలిచెర్ల హెచ్‌ం కె.సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయులు కొండయ్య, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి : ఎంపీపీ

కలిగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రత్యూష, జడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, తదిరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా కొండాపురం మండల సమావేశం

కొండాపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సమావేశం మొక్కుబడిగా జరిగింది. మూడు నెలల కాలంలో విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, పశుసంవర్థకశాఖ, ఇరిగేషన్, వ్యవసాయం తదితర శాఖలలో జరిగిన అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ఎంపీడీవో ఆదినారాయణ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం.వెంకటరావు, ఎంఈవో-2 ఆనందరావు, పలుశాఖల అధికారుల తోపాటు ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువాలు, కుర్చీల వితరణ

బిట్రగుంట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నెల్లూరు ప్రగతి క్లబ్ ఛైర్మన్ డీఎన్ కుమార్ రెండు బీరువాలు, 50 కుర్చీలను బుధవారం అందజేశారు. అలాగే వాకా మహేశ్వరరెడ్డి 10 కుర్చీలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కనకారావు, సరస్వతి నమస్తుభ్యం కమిటీ ఛైర్మన్ ప్రసాదరావు, క్లబ్ సభ్యులు సుబ్బారావు, గుప్తా, ఎస్‌ఎంసీ ఛైర్మన్ తాత మదన్, కోఆప్షన్ సభ్యుడు వాకా మహేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు అర్థరహితం

బిట్రగుంట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితమని టీడీపీ బోగోలు ఇంచార్జి చిలకపాటి వెంకటేశ్వర్లు అన్నారు. బోగోలులోని ఆయన నివాసంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. గ్రావెల్, ఇసుక, మట్టి మాఫియా దొంగలు ఎవరో జిల్లాలో అందరికీ తెలుసన్నారు. నీతులు మాట్లాడుతున్న వైసీపీ నేత వీరరఘు గ్రావెల్ తవ్వకాలో వాటా తీసుకోలేదని ప్రమాణం చేయాలన్నారు. మధుబాబునాయుడు గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదన్నారు. సుకుమార్‌రెడ్డి ఎవరి అవినీతి గురించి బహిరంగా చెప్పారో ప్రజలు విన్నారన్నారు. టీడీపీ నేతలు నాగరాజు, అర్పత్‌రాజ్, శీనయ్య, ఎస్.వెంకట్రావు, బీ.ప్రభాకర్, పీ.రమేష్‌బాబు పాల్గొన్నారు.

తీగలు తెగి విద్యుత్ అంతరాయం

లింగసముద్రం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం ఉదయం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడి 12 గంటలు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని వెంగళాపురంతో పాటు పలు గ్రామాల్లో బలమైన ఈదురు గాలులు వీయడంతో పాటు ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు కురిశాయి. దీంతో వెంగళాపురంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం తీగ, శింగరపాలెం సమీపంలోని చాకిరేవు వాగు వద్ద ఉన్న రెండు విద్యుత్ స్తంభాల తీగలు తెగి కిందపడ్డాయి. వెంగళాపురం, చినపవని, శాయిపేటలో ఇన్సులేటర్లు పగిలి పోయాయి. విద్యుత్‌శాఖ ఏఈ షేక్ ఫిరోజ్, సిబ్బంది యుద్ధప్రాతిపదికన తెగిన తీగలు బిగించి, ఇన్సులేటర్లు కొత్తవి ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు

బిట్రగుంట : బోగోలు మండలంలో ఉదయం నుంచి ఈదురు గాల్పులు వీచడంతో జువ్వలదిన్నె పంచాయతీ కొత్తకడపాలెం పొల్లాలో విద్యుత్ స్తంభం విరిగి పడ్డంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఆ సమయంలో పొలంలో మేత మేస్తున్న ఐదు గేదెలు, దూడ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. పశువుల కాపరులు సహాయక లైన్‌మెన్ సుబ్బారెడ్డికి సమాచారం ఇవ్వడంతో ఆయన విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. అనంతరం సంఘటనాస్థలానికి చేరుకుని జరిగిన ప్రమాద విషయాన్ని ఏఈ జడరాయ్‌కు తెలియజేశారు. విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం గిరిజన కాలనీలో విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఎస్సీ బాలుర హస్టల్ సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. లైన్‌మెన్ బ్రహ్మయ్య సిబ్బందితో మరమతులు చేపట్టారు. దీంతో మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

అల్లూరులో కుండపోత వాన

అల్లూరు : అల్లూరులో బుధవారం ఉదయం కుండపోత వాన కురిసింది. ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమై అరగంటపాటు భారీ వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. ఈదురుగాలులు విస్తృతంగా వీయడంతో వాన జల్లులు తీవ్రతరం దాల్చాయి.

చెత్త బుట్టల పంపిణీ

వలేటివారిపాలెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం గ్రామ సచివాలయంలో వృథాగా ఉన్న తడి పొడి చెత్త బుట్టలను పంచాయతీ కార్యదర్శి మురళి గ్రామ సర్పంచు సాధు శ్రీలత ద్వారా బుధవారం స్థానిక ఎస్సీ కాలనీలో ఇంటింటికి పంపిణీ చేయించారు. 'సచివాలయంలోనే చెత్త బుట్టలు' అని బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి మురళి స్పందించి వీటిని పంపిణీ చేయించారు.



వలేటివారిపాలెం ఎస్సీ కాలనీలో చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచు శ్రీలత

ముగిసిన సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



ఏకాంత సేవలో సంగమేశ్వరస్వామి

సంగం, ఏప్రి ల్ 16 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్థ రాత్రి సంగమేశ్వరుని ఏకాంతసేవ నిర్వహించారు. ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిసాయి.

ఘనంగా కందుకూరి జయంతి



కందుకూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

అనంతసాగరం ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకల మర్రి ఉన్నత పాఠశాలలో బుధవారం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడిక తీయాలని రైతుల ఆందోళన



ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

సంగం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి పొలాల్లోని అంతర్గత పంట కాలువల్లో పూడిక తీయాలని రైతులు ఇరిగేషన్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేశారు. ఆమేరకు వారు కార్యాలయంలో ఏఈ వినయ్ కుమార్‌ను కలిసి పంట కాలువల్లో పూడికతీయకపోతే ఎడగారులో నీళ్లు పారవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తరుణవాయి పొలాల రైతులు పాల్గొన్నారు.

గాలివానతో వాణిజ్య పంటలకు నష్టం

● ధాన్యం తడవడంతో అన్నదాతల ఆందోళన ● కూలిన బొప్పాయి, తాటిచెట్లు, విద్యుత్ స్తంభాలు

కలువాయి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో అన్నదాతకు అపార నష్టం వాటిల్లింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఆశించిన ధర లేకపోవడంతో రైతులు పొలాల్లో నుంచి ధాన్యాన్ని ఎత్తుగా నీరు నిల్వకుండా ఉండే చోటుకు తరలించి అక్కడ ఆరబెట్టుకుంటున్నారు. ఈ దశలో ఆదివారం రాత్రి, మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో నిల్వ చేసుకున్న కుప్పలతో పాటు, ఆరబెట్టుకున్న ధాన్యం కొంతమేరకు తడిచిపోయింది. గిట్టుబాటు ధర లేక ధాన్యం నిల్వ చేసుకుంటే అకాల వర్షం నిండా ముంచిందని వాపోతున్నారు. కాగా, మొలకెత్తిన ధాన్యాన్ని జనసేన పార్టీ మండల కన్వీనర్ మనోహర్ పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకుపోతామని రైతులకు హామీ ఇచ్చారు.



ఈదురు గాలులకు కలువాయి మండలం తెలుగురాయపురం-కోటితీర్థం రోడ్డుపై కూలిన తాటిచెట్లు

ఈదురుగాలుల బీభత్సం

మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. తెలుగురాయపురం- కోటితీర్థం మధ్యలో రోడ్డుకు అడ్డంగా తాటి చెట్లు కూలిపోయాయి. దీంతో ఈమార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం సాయంత్రం వరకు కూడా రోడ్డుపై ఉన్న చెట్లు తొలగించలేదు. దీంతో కలువాయి-చేజర్ల మార్గంలో ఆర్టీసీ బస్సులు తిరగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. తోపుగుంట సమీపంలో 11కేవీ విద్యుత్ లైన్ స్తంభాలు పడిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ సిబ్బంది వెంటనే స్పందించి మంగళవారం రాత్రి 9గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. కలువాయి టౌన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో వాటిని బుధవారం మార్చారు. గాలులతో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది.

దెబ్బతిన్న బొప్పాయి పంట

అనంతసాగరం: మండలంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన గాలివానకు బొప్పాయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. సంజీవ నగరం, గౌరవరం, అగ్రహారం, బొమ్మవరం గ్రామాల్లో ఈసారి అధిక విస్తీర్ణంలో బొప్పాయి పంట సాగు చేశారు. ప్రస్తుతం కాయ దశలో మొక్కలు గాలి వానకు వేర్లతో సహా కుప్పకూలాయి. దెబ్బతిన్న పంటలను ఆత్మకూరు ఉద్యానవన అధికారులు బుధవారం పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు.

వర్షంతో వీధుల జలమయం

సంగం : ఈదురు గాలులతో పాటు భారీ వర్షం కురవడంతో సంగంలో వీధులు జలమయం అయ్యాయి. దీంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడ్డారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

సీతారామపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తి తీరేదెలా..? అనే కథనం ఈనెల 8వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో అధికార యంత్రాంగం స్పందించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్డీఏ ఆధ్వ ర్యంలో బుధవారం తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఏపీఎం వైనారూతు, మండల టీడీపీ నాయకులతో కలిసి పాతబస్టాండ్ పక్కన చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ కన్వీనర్ చెన్నకేశవులు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం తనిఖీ

అనంతసాగరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆత్మకూరు ఆర్డీవో పావని బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ సాధ్యం

ఉదయగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా అగ్నిప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఫైర్ అధికారి అశోక్‌కుమార్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఎస్టీ కాలనీ వాసులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. సిలిండర్ నుంచి మంటలు వ్యాపించినప్పుడు ఏవిధంగా అదుపు చేయాలో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

●మర్రిపాడు : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక హైస్కూల్ ఆవరణలో ఫైర్‌సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇళ్లల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు.

కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు కూలి

ఉదయగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీలు కొలతల ప్రకారం పనులు చేసి గిట్టుబాటు కూలి పొందేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని ఎంపీడీవో అప్పాజీ, ఏపీవో శ్రీనివాసరావులు సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

సీతారామపురం: స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో బుధవారం ఏపీవో శ్యామల మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల పై సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో కూలీల హాజరు, ఆన్‌లైన్ నమోదు, పనులు తదితర అంశాలపై సమీక్షించారు. గ్రామాలలో ఉపాధి హామీ పనులు లేవని ఎవరూ చెప్పకూడదని, ప్రతీవారం లేబర్ ఇంప్రూవ్‌మెంట్ చేపట్టకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు మురళి, రంగనాథ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 621 బేళ్లను తీసుకొని రాగా 15 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 482 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 139 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 225 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికుల ఆందోళన

ఆత్మకూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు కె డేవిడ్‌రాజు, కార్యదర్శి నాగేంద్ర మాట్లాడుతు మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని కోరారు. ఈమేరకు మున్సిపల్ కార్మికులు, సీఐటీయు నాయకులు మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు ఉపాధ్యక్షుడు ఎస్‌డి రిజ్వాన్, కార్మిక నేతలు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయు నాయకులు, కార్మికులు

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం

సీతారామపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఏపీఎం వైనారూత్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం అధ్యక్షతన డ్వాక్రా సంఘాలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయ అధికారులు సురేష్, రాంమోహన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి మహిళ ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించాలని కోరారు. ఈకార్యక్రమంలో సిసిలు, ఎఈవో సాంబశివయ్య, మండల వ్యవసాయ సిబ్బంది, పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో గల వాటర్ ట్యాంకు మరమ్మతు పనుల దృష్ట్యా గురువారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో మున్సిపాల్టీ పరిధిలోని 3,4,5,21,22,23 వార్డులలో తాగునీటి సరఫరా నిలిపివేయడం జుగుతుందన్నారు. మరుసటి రోజు యధావిధిగా నీటి సరఫరా జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం అర్హులైన ఎస్సీ లబ్ధిదారుల నుంచి ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో అప్పాజీ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మండలానికి 15 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. అర్హులైన వారు వచ్చేనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ఉదయగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని బుధవారం మండలంలోని గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు మాలకొండారెడ్డి, ఖాజాఅహ్మద్, ధనమ్మ, హసీనాలు గ్రామంలో పర్యటించారు. బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం చేపట్టారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

దుత్తలూరు (ఉదయగిరి), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను సూచించారు. బుధవారం మండలంలోని భైరవరం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల సమగ్ర ఆరోగ్య అభివృద్ధి లక్ష్యంగా పోషణ పక్వాడ్ నిర్వహిస్తున్నామన్నారు.

పాఠశాలలో తిథి భోజన కార్యక్రమం

ఉదయగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాఫర్‌అహ్మద్ బుధవారం విద్యార్థులకు తిథి భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు పాల్గొన్నారు.